కుక్క-గాడిద

వసుంధర

ఇన్ స్పెక్టర్ రాఘవరావు అప్పుడు డ్యూటీలో లేడు. కాబట్టి డబ్బెట్టి పేకాడుతున్నాడు. ఆ విషయం నవ్వుతూ అన్నట్లుగా అన్నాడు అతని స్నేహితుడు గోవిందం.

రాఘవరావు జోకును కాస్త సీరియస్ గానే తీసుకుని- "స్నేహితులతో డబ్బెట్టి పేకాడ్డం తప్పుకాదు—" అన్నాడు.

"అలా అనుకుందామనుకున్నా ఇక్కడున్నవారంతా నీ స్నేహితులు కారు" అన్నాడు గోవిందం స్నేహితుణ్ణి కవ్వించడానికి.

అయితే అతనన్నమాటలు నిజమే! అక్కడున్న నలుగురిలోనూ గోవిందం ఒక్కడే రాఘవరావు స్నేహితుడు. మిగతా ఇద్దరూ గోవిందం స్నేహితులు. అందులో రామానుజంతో రాఘవరావుకిదివరకే పరిచయముంది కానీ సుబ్బారావును చూడడం ఇదే ప్రథమం.

"పేకాటే వాళ్ళమధ్య నున్న స్నేహం అన్నదమ్ముల అనుబంధాన్ని మించినదని నీకు తెలీదనుకుంటాను. ఏ

కోణాన ఒక పంక్తిలో కూర్చున్నామో అప్పుడే రాఘవరావుగారు నాకు స్నేహితులైపోయారు" అన్నాడు సుబ్బారావు.

రాఘవరావు ముఖం వికసించింది. అయితే ఈలోగా గోవిందం "పేకాడేవాళ్ళంతా స్నేహితులే అయితే, స్నేహితులలో డబ్బెట్టి పేకాడ్డం తప్పు కాకపోతే– మొన్న నువ్వెందుకురా "ఫ్రెండ్స్ క్లబ్" మీద రెయిడ్ చేసి పేకాడుతున్న నేరానికి పదిమందిని అరెస్టు చేశావు?" అన్నాడు.

సుబ్బారావు మరోసారి రాఘవరావును ఆదుకున్నాడు "అయితే నీ ఇల్లూ క్లబ్బూ ఒక్కటేనంటావు..." అని కాస్త తెల్లబోయిన గోవిందం వంక చూసి చిన్నగా నవ్వుతూ "క్లబ్ లో పేకాడితే తప్పు. ఇంట్లో పేకాడితే తప్పుకాదు. ఇంట్లో చేసే చాలా పనులు క్లబ్బులో చేయడం తప్పు..." అన్నాడు.

"ఎందుకట?" అన్నాడు రామానుజం.

"తెలుసుకోవాలనున్నవాడు స్వంత పెళ్ళాన్ని ఒకసారి నడిరోడ్డుమీద ముద్దుపెట్టుకుని చూస్తే–పోలీసులు, కోర్టులు, లాయర్లు – తనంతటతానే అదెందుకు తప్పో తెలుసుకుంటాడు..." అన్నాడు సుబ్బారావు.

"సుబ్బారావుతో వాదించడం కష్టం. వాడు ఇనస్పెక్టర్ గార్ని రక్షించాలనుకున్నాడు. ఆయనకు సాయపడుతున్నాడు. వాడి సాయం లభించినవాళ్ళ జోలికి వెళ్ళడం మంచిదికాదు. నేను విరమించుకుంటున్నాను" అన్నాడు గోవిందం.

"చాలా థాంక్సండీ సుబ్బారావుగారూ – ఈరోజు నాకో మంచి స్నేహితుడు లభించినందుకు చాలా సంతోషంగా వుంది" అన్నాడు రాఘవరావు.

"పోలీసులతో స్నేహం నాకే మంచిది. ఎప్పుడైనా అవసరానికి సాయపడతారు. నావల్ల మీకేం ప్రయోజన ముంటుంది?" అన్నాడు సుబ్బారావు.

"అలా నిన్ను నువ్వు చిన్నబుచ్చుకోకు. నీ సలహాల వల్ల ఎంతమంది బాగుపడలేదు? అందులోనూ అపరాధ పరిశోధన నీకు హాబీకదా..." అన్నాడు గోవిందం.

"ఈజిట్!" అని ఆశ్చర్యపడ్డాడు రాఘవరావు.

"హాబీలోనూ సామాన్యంకాదు. ఎక్కడైనా ఏదైనా కేసు వివరం తెలిస్తే దాన్నిబట్టి వీడు ఘున్నంగా పాయింట్లు లాగి ఇలా ఇలా జరిగుండవచ్చునని అంటూం టాడు. చాలాసార్లు అలాగే జరగడం నాకు ఆశ్చర్యాన్ని కూడా కలిగించింది" అన్నాడు గోవిందం.

"ఎందుకురా ఇప్పుడవన్నీ" అన్నాడు సుబ్బారావు.

ఆ మాట వినిపించుకోకుండా "వీడి లేటెస్ట్ ప్రిడిక్షన్ చెప్పనా?" అన్నాడు గోవిందం.

రాఘవరావు ఉత్సాహంగా తలాడించాడు.

"ఫ్రెండ్స్ క్లబ్‌ను రెయిడ్‌చేసి అరెస్టులు చేశాక నువ్వు నేరస్థులను వదిలిపెట్టవలసి వచ్చింది. అందుకు కారణం" అని ఆగిపోయాడు గోవిందం ఎందుకంటే సుబ్బారావు అతనివంక ఉరిమి చూస్తున్నాడు.

"చెప్పు!" అన్నాడు రాఘవరావు కుతూహలంగా.

"చెప్పేస్తాన్రా మరి!" అని గోవిందం చెప్పసాగాడు.

ఆ క్లబ్‌లో దొరికిన వారందరూ పెద్దమనుషులు. డబ్బున్నవారు. వారు రాఘవరావును బెదిరించారు. అతను లొంగలేదు. రాఘవరావు పాత కక్షను సాధించడంకోసం ఈ పని చేసినట్లు కథ అల్లి సాక్ష్యాలు సంపాదిస్తామని వారు బెదిరించారు. ఆ పెద్దమనుషులకు పేరుమోసిన లాయర్లున్నారు.

పోలీసు అధికారి అయుండీ, ఒక నేరానికి ప్రత్యక్ష సాక్షి అయుండీ కూడా సరైన ఇతర సాక్ష్యాధారాలు లేకుండా కేసులు వ్రాయిస్తే అతను ప్రమాదంలో పడ గలడు. అందుకే రెయిడింగ్ సమయంలో అతను కొన్ని ఫోటోలు తీసుకున్నాడు. ఆ ఫోటోల సాక్ష్యంతో అతను అనుకున్నది సాధించగలడు. అయితే ఆ ఫోటోలు పోయాయి. దాంతో రాఘవరావు భయపడి నేరస్థులను వదిలిపెట్టేశాడు.

"అద్భుతం. నిజంగా ఇదంతా మీరే చేయించినంత సులభంగా ఊహించారు" అన్నాడు రాఘవరావు.

"ఇలాంటి మాటలు వినాల్సి వస్తుందనే నా ఊహాలు పోలీసులకు చెప్పడం ఇష్టముండదు నాకు" అన్నాడు సుబ్బారావు.

"సారీ" అన్నాడు గోవిందం.

"నేనుకూడా సారీ చెబుతున్నాను కానీ మీరు అన్యథా భావించకుండా నేనడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పాలి..." అన్నాడు రాఘవరావు.

"మీరిప్పుడు డ్యూటీలో లేరు" అన్నాడు సుబ్బారావు.

"ఇది డ్యూటీకి సంబంధించిన విషయంకాదు. నే నిప్పుడు మీ స్నేహితుణ్ని!"

"అయితే అడగండి..." అన్నాడు సుబ్బారావు.

"మీరు విషయాన్ని ఇంత పెర్‌ఫెక్ట్‌గా ఎలా ఊహించగలిగారు?" అన్నాడు రాఘవరావు.

"అంటే_నిజంగా ఆ ఫోటోలు పోయాయా?"

"పోయాయి. కానీ ఆ విషయం నేను నేరస్థులకు చెప్పలేదు. అలా చెప్పడంవల్ల వాళ్ళు మరింత పేట్రేగి

పోతారని భయపడ్డాను. చిన్నగా హెచ్చరించి వదిలే శాను..."

"పోలీసులతో గొడవ ఎవరికీ ఇష్టముండదు. వాళ్ళు తమ జాగ్రత్తలో తాముంటారు. ఇంక మీ జోలికి రారు..." అన్నాడు సుబ్బారావు.

"కానీ... ఈ విషయాన్ని ఇంత కచ్చితంగా మీరెలా ఊహించగలిగారు? ఇలాంటి అనుభవాలు ఇదివరలో మీకేమైనా ఎదురయ్యాయా?" అన్నాడు రాఘవరావు.

"చెప్పాలంటే ఇందాకా గోవిందం అన్నట్లు అప రాధ పరిశోధన నాకు హాబీ. నేను వార్తల్లో నేరాల గురించే వెతుకుతూంటాను. వాటినుంచి కేసులు తయారు చేసి వివరాలూహించడానికి ప్రయత్నిస్తూంటాను. అను భవం నా పెర్ఫెక్షన్‌కి కారణమయ్యుండవచ్చు. కానీ మీరు నన్ను మరీ మరీ ఈ ప్రశ్న అడగటానికి కారణ మేమిటీ?"

"ఆ దొంగతనం ఎలా జరిగిందో తెలుసుకోవాలనుంది నాకు. ఆ ఫోటోల విషయంలో చాలా జాగ్రత్త వహిం చాను నేను. వాటి ఉనికి అతిరహస్యంగా ఉంచబడింది" అన్నాడు రాఘవరావు.

"అన్నీ ఊహతో కనుక్కోవడం సాధ్యపడితే ఈ ప్రపంచంలో జీవితానికి థ్రిల్ ఉండదు. ఆ దొంగతనం ఆ పెద్దమనుషులు చేయించి వుండవచ్చు. లేదా సామాన్యమైన దొంగ ఏమో అనుకుని ఏమో తీసు కుని వుండవచ్చు. ఎవరైనా బ్లాక్ మెయిలర్ కావ చ్చును. ఆ ఫోటోలు మీనుంచి కాజేసి ఆ పెద్ద మను ష్యుల్ని బ్లాక్ మెయిల్ చేస్తుండవచ్చును..."

"నిజమే-కానీ ఆ దొంగతనం ఎలా జరిగిందీ అని!"

సుబ్బారావు క్షణం ఆలోచించి "మీరు అది తెలుసుకోవాలంటే మీరా ఫోటోలను దాచడంలో ఎటువంటి జాగ్రత్త వహించారో నేను తెలుసుకోవలసి వుంది" అన్నాడు.

"సామాన్యంగా పోలీసులు ఇటువంటి వ్యవహారాల్లో ఎటువంటి జాగ్రత్త వహిస్తారో ఊహించలేరా?" అన్నాడు రాఘవరావు.

"ఊహించగలను. కానీ చెప్పదల్చుకోలేదు. ఎందుకంటే ఎప్పుడైనా అవసరం నన్ను దొంగగా మారిస్తే_ ఈ ఊహలన్నీ అప్పుడుపయోగపడతాయి. అవన్నీ ఒక పోలీసు అధికారికి చెప్పడంవల్ల నాకు చాలా నష్టంకదా మరి" అని నవ్వేశాడు సుబ్బారావు. అతనితో శ్రుతి కలిపారు గోవిందం, రామానుజం.

రాఘవరావు మాత్రం ఆశ్చర్యంగా అనుమానంగా అతని వంక చూశాడు.

2

నగరంలో ఒక హత్య జరిగింది. హతుడు బ్రహ్మచారి మధ్య తరగతివాడు. ఒక్కడూ గది తీసుకుని వుంటున్నాడు. పరిచయాలు చాలా స్వల్పం. విషప్రయోగం వల్ల మరణించాడతను.

హతుడు ఆత్మహత్య చేసుకుంటాడనుకునేందుకు ఏ మాత్రమూ అవకాశంలేదు. అతడికి డైరీ రాసే అలవాటుంది. చనిపోయే ముందురోజువరకూ అతడు డైరీ రాశాడు.

అతడికి ఏవిధమైన సమస్యలూ లేనట్లు, జీవితంపై ఏమాత్రమూ విముఖత లేనట్లూ ఆ డైరీ కచ్చితంగా చెబుతోంది. అదీకాక హత్యజరిగిన నాటికి వారంరోజుల్లో అతను పెళ్ళిచూపులకు వెళ్ళబోతున్నాడు. ఆ పిల్లగురించి

అతనికి ముందే కొంతగా తెనుసును. ఆ అమ్మాయే భార్య అయితే తను చాలా అదృష్టవంతుడినని అతను భావిస్తున్నాడు. ఆమెను గురించి అతను కంటున్న కలలు కూడా కొన్ని డైరీలో వ్రాయబడ్డాయి.

ఆ డైరీ చదివినవాడెవడూ అతను ఆత్మహత్య చేసు కుంటాడనుకోడు.

హంతుడి గదికి వెళ్ళాలంటే ఓ పెద్ద సందులోకి వెళ్ళి అక్కణ్ణించి ఇరుకు సందులోకి వెళ్ళాలి. అతను ఇంటికి ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెడతాడో, అతనింటికి ఎవ రెవరు వచ్చి వెడుతూంటారో పెద్దగా పట్టించుకున్న వాళ్ళెవ్వరూ లేరు. అందువల్ల పోలీసులకి దొరికిన సమా చారం చాలా స్వల్పం.

అయితే హత్య జరిగిన చోట పోలీసులకు ఒక వస్తువు దొరికింది. అది హతుడికి సంబంధించినదికాదు. హంత కుడికి సంబంధించినదనుకోవడానికి కొద్దిగా ఆధారా లున్నాయి.

ఆ వస్తువు ఏమిటో పోలీసులు బయటపెట్టలేదు. దాని సహాయంతో ఈ హత్యారహస్యాన్ని ఛేదించవచ్చునని వారు ఆశపడుతున్నారు.

హంతకుడికి సంబంధించిన ఆ వస్తువు డాక్టర్ నర్సన్న గారింట్లో భద్రపర్చబడినట్లూ అక్కడ ఆ వస్తువుపై వారంరోజులపాటు రకరకాల పరీక్షలు జరుగుతాయనీ పోలీసులు పబ్లిగ్గానే ప్రకటించారు. అలా ప్రకటించ డంలో పోలీసుల ఉద్దేశ్యం హంతకుడు ఆ వస్తువు గురించి ప్రయత్నించి పట్టుబడిపోతాడని!

ఆ తర్వాత ఆ హత్యకేసు గురించి ఎవ్వరూ ఏమీ వినలేదు. పేపర్లు, ప్రజలుకూడా క్రమంగా దానిగురించి

మరిచిపోవడం జరిగింది. దానిగురించి మరిచిపోని అతికొద్ది మందిలో సుబ్బారావు ఒకడు!

"నేనిలా అన్నానని మళ్ళీ రాఘవరావుదగ్గర అనకు. పోలీసులు చాలా తెలివితక్కువ వారిలా కనిపిస్తున్నారు. వారిదగ్గర ఉన్న ఆ వస్తువును ఎవరో కాజేసివుంటారు" అన్నాడు సుబ్బారావు, గోవిందంతో.

"అలా ఎందుకు జరుగుతుంది?" అన్నాడు గోవిందం.

"వారిదగ్గర ఆ వస్తువు వుండివుంటే కొంతకాలం పాటు హంతకుడు ట్రాప్‌లో పడతాడేమోనని ఎదురు చూసి అలా జరక్కపోయేక వాళ్ళే దాన్ని బయటపెట్టి పదిమంది దృష్టిలోకి తీసుకువచ్చి ఎవరైనా దాన్ని ఫలానా వ్యక్తికి చెందిన వస్తువుగా ఐడెంటిఫై చేయగల రేమో తెలుసుకునేందుకు ప్రయత్నించేవారు. పోలీసులు కిమ్మనకుండా ఊరుకోవడాన్ని బట్టి వారివద్ద హత్యకు సంబంధించి ఏవిధమైన ఆధారమూ లేదని నిర్ధారణ చేయవచ్చు" అన్నాడు సుబ్బారావు.

"నీ ఊహ బాగానే వుంది కానీ హంతకుడు పోలీసుల కన్నుగప్పి ఎలా మాయం చేయగలిగాడంటావ్?" అన్నాడు గోవిందం.

"నీ వెర్రికానీ హంతకుడు ఆ వస్తువు కోసం ఎందుకు ప్రయత్నిస్తాడు?"

"తనను పట్టిచ్చే ఆధారంకోసం ఏ హంతకుడు ప్రయత్నించడు?"

"కొంచెం ఆలోచించి చూస్తే నీ ఆలోచనలోని తప్పు నీకే తెలుస్తుంది. హంతకుణ్ని ట్రాప్ చేయడం కోసం పోలీసులు ఆ ఆధారాన్నుపయోగించనున్నారని అమాయకులక్కూడా అర్థమవుతుంది. అంటే ఆ ఆధా

రాన్ని బట్టి హంతకుడెవరో తెలియదు. ఆ ఆధారం కోసం ప్రయత్నిస్తేనే హంతకుడెవరో బయటపడుతుంది. హత్యచేసినవాడు ఈమాత్రం ఊహించలేకపోడు –అందులోనూ డిటెక్టివ్ సాహిత్యం ఇప్పటి స్థాయికి చేరుకున్నాక!'' అన్నాడు సుబ్బారావు.

''హంతకుడు కానివాడికి ఆ ఆధారంతో పని ఏమిటి?''

''బ్లాక్ మెయిలింగ్!'' అన్నాడు సుబ్బారావు ''ఈ రోజుల్లో శ్రమపడకుండా డబ్బు సంపాదించే మార్గమది. అందుగురించి కొందరు అప్పుడప్పుడు శ్రమపడి ఇలాంటి వస్తువులు సేకరిస్తూంటారు.''

గోవిందం అనుమానంగా సుబ్బారావువంక చూసి ''నేను పోలీసు ఇన్స్పెక్టర్ని కాకపోయినప్పటికీ కూడా నిన్ను అనుమానించాలనిపిస్తోందిరా–నువ్వే బ్లాక్ మెయిలింగ్ వ్యవహారం స్వయంగా నడిపిస్తున్నావేమోనని!'' అన్నాడు.

''నేనా? నాకంత కర్మం పట్టింది? అయినా నేను బ్లాక్ మెయిల్ చేస్తానేమోనన్న అనుమానం నీకు కలిగిందంటే నీ ప్రవర్తనలో ఏదో లోపముండి వుండాలని నా ఊహకు తడుతోంది. అదేమయివుంటుందో చెబుతానుండు...'' అన్నాడు సుబ్బారావు.

''బాబ్బాబు ఊరుకుందూ – కాస్త నెమ్మదిగా మాట్లాడు...'' అన్నాడు గోవిందం. ఆఫీసులో ఆడ టైపిస్టుతో అతను కాస్త చనువుగా వుంటాడన్న విషయం సుబ్బారావుకు తెలుసును. ఆ విషయం గోవిందం భార్యకు తెలియడం ఇష్టంలేదనికూడా సుబ్బారావుకు తెలుసును.

3

"కెవ్వు" మన్న కేక విని వీధిలోని జనం చాలామంది ఆగిపోయారు. చాలామంది ఆ కేక వచ్చిన వైపు గాలించారు. అక్కడొక పాతికేళ్ళ మనిషి వుంది. ఆ కేక వేసినది ఆమే!

"శవం!" అని అరిచిందామె మళ్ళీ.

జనం గుమిగూడారు.

"ఏం జరిగింది?" చాలామంది అడిగారు. జవాబుగా ఆమె గుమ్మంలోకి చూపించింది. గుమ్మందాకా వెళ్ళిన వాళ్ళకు ఏం జరిగిందో ఎవరూ చెప్పనవసరం లేకపోయింది.

ఒక మనిషి వెల్లికితలా పడివున్నాడు. అతడి గుండెల్లోకి దిగివుంది కత్తి. రక్తం ఛాతీపైకి చిమ్మివుంది.

"హత్య!" అన్నారు ఇద్దరు ముగ్గురు అప్రయత్నంగా.

"నువ్వెవరు?"అన్నాడు అక్కడున్నవారిలో ఒకతను ఆ ఆడమనిషిని.

"నేను వీరింట్లో పనిమనిషినండి..." అందామె.

తడబడిపోతూ ఆమె చెప్పిన వివరాలేమిటంటే- గదిలో ఆమె చచ్చిపడున్నతని పేరు జగన్నాథస్వామి. ఒక్కడే వుంటున్నాడు. ఈమె అతని ఇంట్లో రెండు నెలలుగా పనిచేస్తోంది. జగన్నాథస్వామి చాలామంచివాడు. ఉదారస్వభావుడు. తను మామూలుగా పని చేయడానికి వచ్చి తలుపులు తోయగా ఈ దృశ్యం కళ్ళబడింది.

"అర్జంటుగా పోలీసులకు ఫోన్ చేయాలి. మీరంతా ఇక్కడే వుండండి...వాళ్ళడిగే ప్రశ్నలకు సమాధా

సాక్ష్యం బాగా పనికొస్తుంది" అన్నాడక్కడున్న వాళ్ళతో పనిమనిషిని పలకరించినతను.

పోలీసులు, సాక్ష్యం అన్న మాట వినగానే అక్కడున్నవారందరూ ఒకొక్కరే ఏవేవో పనులున్నాయంటూ తప్పించుకున్నారు. పనిమనిషి ఒక్కతే అక్కడ నిలబడింది.

"వీళ్ళింట్లో ఫోన్ వుందా?" అనడిగాడతను.

"లేదు" అందామె.

"పోలీసులు వచ్చేవరకూ నువ్విక్కడుంటావా,నీకింకా ఇక్కడేమైనా పనులున్నాయా?" అన్నాడతను మళ్ళీ.

"ఇంకా చాలా ఇళ్ళలో పనికెళ్ళాలండి" అందామె.

"అయితే నువ్వు వెళ్ళు. నేను పోలీసులకు కబురు చెబుతాను..." అన్నాడతను.

పనిమనిషి ముఖం సంతోషంతో వెలిగింది.

"ఇంట్లో ఏమైనా ఖరీదైన వస్తువులున్నాయా?"

"మనిషి ప్రాణంకంటె ఖరీదైనదేముంటుంది బాబూ" అంది పనిమనిషి కళ్ళొత్తుకుంటూ.

"దానికేంకాదు. హంతకుడు ఎందుకీ హత్య చేశాడూ అనడానికి ఇలాంటి విషయాలు దోహదం చేస్తాయి. అయినా అవన్నీ పోలీసులు చూసుకుంటారులే కానీ నువ్వొక్క క్షణం బయట నిలబడు. నేను లోపలికి వెళ్ళి తాళం వెదుకుతాను. గదికి తాళం వేసి అప్పుడు పోలీసులకు కబురుచేస్తే చాలా మంచిది" అన్నాడతను.

"తాళం ఎక్కడుందో నాకు తెలుసు బాబూ!" అంది పనిమనిషి.

"తెలిసినా నువ్వు వెళ్ళకూడదు. ఎందుకంటే అక్కడ మన వేలిముద్రలు పడకుండా, మనగురించి ఏ

ఆధారాలూ వదలకుండా ప్రయత్నించాలి. లేకపోతే అన్నీ మన నెత్తిమీదకే వస్తాయి...'' అన్నాడతను.

అతని మాటలకు పనిమనిషి బాగా భయపడింది. అతన్నే లోపలకు వెళ్ళమని తాళాలెక్కడుంటాయో చెప్పింది. అతను లోపలకు వెళ్ళి తలుపులు వేసుకున్నాడు.

పనిమనిషి బయట నిలబడింది.

హత్యగురించి తెలిసినవారందరూ వెళ్ళిపోయారు. ఉన్నవారిలో కొందరు దూరాన్నుంచి ఆ ఇంటికేసే చూస్తున్నారు. తెలియనివారు చాలామంది వీధిలో మామూలుగా అటూ ఇటూ తిరుగుతున్నారు.

పనిమనిషి వణుకుతూ పది నిముషాలు అక్కడ నిలబడి వుంది. లోపలకు వెళ్ళిన మనిషి అంతసేపు అక్కడ ఏం చేస్తున్నాడో ఆమెకు తెలియలేదు.

ఆమె నిలబడి వుండగానే అతను సన్నగా తలుపులు తెరిచి గదిలోంచి బయటకు వచ్చాడు. తలుపులు దగ్గరగా లాగి తాళం వేశాడు. తాళంచెవి పనిమనిషికి ఇచ్చి—తన చేతిలోని రుమాలు చూపించి—"నా వేలిముద్రలు పడకుండా ఈ జాగ్రత్త తీసుకున్నాను. నీకైతే ఇలాంటివి తెలియవు. నువ్వు జాగ్రత్తగా ఈ తాళం దాచు. ఎవరింట్లో వుంటావో చెప్పు. పోలీసులకు నేను కబురు చేసుతాను'' అన్నాడు.

పనిమనిషి తాళంచెవి అందుకుంది. అతను వెళ్ళిపోయాడు.

4

ఇన్స్పెక్టరు రాఘవరావు తాళం అందుకుని—"హత్య జరిగిందని ఎలా అనుకున్నావ్?'' అన్నాడు.

మనిషి వెల్లకిలా పడివున్నాడు. గుండెల్లో కత్తి. ఛాతీ నిండుగా రక్తం. తను హత్య జరిగిందనుకోవడానికి కారణాలు ఆమె ఇన్‌స్పెక్టర్‌కి చెప్పింది.

ఇన్‌స్పెక్టర్ తాళం తీశాడు. తలుపులు తోశాడు. జనం మళ్ళీ వీధి గుమ్మందగ్గర పోగవుతున్నారు.

పోలీసు బలగం గదిలో ప్రవేశించి తమ తమ పొజిషన్సు అడ్జస్టు చేసుకుంటున్నారు.

రాఘవరావు శవాన్ని చూసి ఉలిక్కిపడ్డాడు. గుండెల దగ్గర గాయం అయితే వున్నదికానీ ఆ స్థానంలో వుండవలసిన కత్తి లేదు. అతను చటుక్కున పనిమనిషి వంక చూసి "నీ పేరేమిటన్నావ్?" అన్నాడు.

"లక్ష్మి!" అందామె.

"చూడు లక్ష్మి శవం గుండెల్లో కత్తిని చూశానన్నావ్ కదూ" అన్నాడు రాఘవరావు.

అప్పటికి లక్ష్మి శవాన్ని చూసింది. ఆమె వణికిపోతూ "అవును. కాదు" అంది.

అయితే రాఘవరావు ఆమెవద్ద నుంచి అసలు విషయం రాబట్టడానికి ఎంతోసేపు పట్టలేదు. ఆమె జరిగిన విషయం చెబుతూంటే అతను ఆశ్చర్యంగా విన్నాడు.

"హంతకుడు గుండెలు తీసిన బంటు" అన్నాడతను అప్రయత్నంగా.

"అతను హంతకుడా?" అందామె మరింతగా వణికిపోతూ.

"అవును. లేకపోతే హత్యాయుధంతో వాడికేం పని" అన్నాడు రాఘవరావు. అతని ముఖం ఎర్రబడింది. ఎంత ధైర్యం ఆ మనిషికి? నడివీధిలో ఎంతోమంది జనం అతన్ని చూశారు. పనిమనిషి లక్ష్మి అతన్ని చక్కగా గుర్తుపట్ట

గలేదు. ఆ పరిస్థితుల్లో ఆమెను మాయమాటలు చెప్పి మోసం చేసి తన పని తను చేసుకుపోయాడు.

"నువ్వు వాణ్ని గుర్తుపట్టగలవు కదూ?" అన్నాడు రాఘవరావు.

"గుర్తు పట్టగలనండి" అంది లక్ష్మి. కానీ ఆమెకు మనసులో భయంగా వుంది.

అక్కడి తతంగం అంతా ముగించుకుని రాఘవరావు లక్ష్మిని పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్ళాడు. అక్కడ పాత నేరస్థుల ఫోటోలన్నీ చూపించాడు. వాటిలో ఎక్కడా ఆ మనిషి లేడు.

"ఇవన్నీ దొంగ ముఖాలండీ. అతను చాల పెద్దమనిషి లాగున్నాడు" అంది లక్ష్మి.

"నీ తెలివి తక్కువతనం మూలంగా హంతకుడు తప్పించుకు పోయాడు. ఈ హత్యలో నీకు చాలా బాధ్యత వుంది. అసలు నువ్వే ఈ హత్య చేసి హత్యాయుధాన్ని దాచేసి ఈ కట్టుకథంతా చెబుతున్నావని నాకు అనుమానంగా వుంది" అన్నాడు రాఘవరావు.

లక్ష్మి గొల్లుమని గోలపెట్టి రాఘవరావు కాళ్ళమీద పడిపోయి "నాకు నిజంగా ఏమీ తెలియదు. నన్ను నమ్మండి బాబూ" అంది.

తన అనుభవాన్నిబట్టి లక్ష్మికి ఈ కేసులో ఏ విధమైన సంబంధమూ వుండి వుండదని రాఘవరావు వూహించాడు. అయితే హంతకుడు చాలా తెలివైనవాడు. అతన్ని గుర్తు పట్టడానికి ఏకైక ఆధారం లక్ష్మి. అసలు హంతకుడు ఎదురుగా వున్నా లక్ష్మి నిర్లిప్తంగా వుంటే అతన్ని తెలుసుకోవడం తనకు సాధ్యపడకపోవచ్చు. లక్ష్మిని నిర్లిప్తంగా వుంచడానికి అతను చాలా ప్రయత్నాలు చేయవచ్చు. అందువల్ల హంతకుడి ఆచూకీ పోలీసులకు

తెలియజేయవలసిన బాధ్యతను లక్ష్మి ఫీలవ్వాలి. అందుకు ఆమెను భయపెట్టాలి.

"ఒక వారం రోజుల్లో నువ్వు ఆ హంతకుడి ఆచూకీ మా కివ్వాలి. లేకపోతే నిన్ను నేను రక్షించలేను" అన్నాడు రాఘవరావు.

లక్ష్మి దిగులుగా అక్కణ్నించి బయల్దేరింది.

రాఘవరావు లక్ష్మిపై నిఘా వుంచమని ఒక మనిషిని నియోగించాడు. హంతకుడు ఆమెను కలుసుకుని హెచ్చరించవచ్చు.

ఇటీవల తను చేపట్టిన కేసులన్నీ విచిత్రమైన మలుపులు తిరిగి తనకు ఇబ్బందిని కలిగిస్తున్నాయి. ఈ సమస్య తన దొక్కడిదేనా, లేక అందరు పోలీసాఫీసర్లకూ వుందా అని ఆలోచిస్తున్నాడు రాఘవరావు. అతనా ఆలోచనల్లో తాత్కాలికంగా జగన్నాథస్వామి హత్యగురించి మరిచి పోయాడు.

5

"మీ ఆలోచనల్లో చాలా లోపాలున్నాయి" అన్నాడు సుబ్బారావు.

"చెప్పండి" అన్నాడు రాఘవరావు.

"హంతకుడూ, హత్యాయుదాన్ని దాచేసినవాడూ ఒక్కడే ననుకుందాం. హత్యాయుధాన్ని దాచేయడంలో ధైర్యసాహసాల్ని ప్రదర్శించినా యెంతో తెలివిగా ఎన్నో జాగ్రత్తలుకూడా తీసుకున్నాడతను. అన్ని జాగ్రత్తలు తీసుకునేవాడు హత్యాయుధాన్ని తీసుకువెళ్ళడం వెంటనే చేయక హత్య జరిగిన కొన్ని గంటలకు ఆ పని ఎందుకు చేస్తాడు?" అన్నాడు సుబ్బారావు.

"ఎందుకంటే ఏం చెబుతాం? హత్య అనేది ముందుగా

ఆలోచించుకుని పకడ్బందీగా చేస్తే అది వేరే సంగతి. అలాకాకుండా అప్పటికప్పుడు కలిగిన ఆవేశంలో హత్య జరిగిందనుకోండి. అప్పుడు హంతకుడు గాబరాగా అక్కణ్నించి వెళ్ళిపోవచ్చు. తర్వాత తన పొరపాటు గుర్తించి వుండవచ్చు."

"మీరు చెప్పింది బాగానే వుంది కానీ అప్పటికప్పుడు కలిగిన ఆవేశంలో హత్య చేశాడనుకోండి. అంటే హత్యాయుధం అతనివద్ద సిద్ధంగా వుండి వుండదు. అందుబాటులో వుండేదాన్ని హత్యాయుధంగా వాడతాడు. దీన్నిబట్టి జగన్నాథస్వామి తన గదిలో హత్య చేయబడ్డానికి పనికివచ్చే ఓ పెద్ద కత్తి వుంచుకుంటున్నాడనుకోవాలి. బాగానే వుంది. అతని కత్తితో అతన్ని చంపినప్పుడు-హంతకుడు హత్యాయుధంగురించి అంతగా భయపడవలసినదేముంది? దానిమీద తన వేలి ముద్రలుంటాయేమో నన్న భయముంటే అవి జాగ్రత్తగా తుడిచేస్తే సరిపోతుందిగదా! హత్యాయుధాన్ని దొంగిలించడమెందుకూ?" అన్నాడు సుబ్బారావు.

"అలాకాదు. పోనీ హంతకుడు పకడ్బందీగా ప్లాను వేసుకుని వచ్చాడు. కూడా తన కత్తి తెచ్చుకుని వచ్చాడు. హత్యచేశాక వెంటనే ఏదో అలికిడికి భయపడి అక్కణ్నించి పారిపోయాడు. తర్వాత వచ్చి తన హత్యాయుధాన్ని తీసుకు వెళ్ళాడు" అన్నాడు రాఘవరావు.

"అలా అనుకుందామనుకున్నా—హత్యాయుధాన్ని తీసుకు వెళ్ళడానికి పగటి సమయాన్నెందుకు నిర్ణయించుకుంటాడు? పట్టపగలే అంతకు తెగించినవాడు రాత్రి ఆ పని పూర్తి చేసుకోలేడా? అదీగాక రాత్రి ఎక్కడా ఆ వీధిలో ఎవ్వరూ హత్య జరిగినట్లు గుర్తించడం జరగలేదని మీరే అన్నారు. హత్యాయుధాన్ని కాజేసినది హంతకుడే

అయుంటే-అందుకు ఒకే ఒక్క కారణం స్ఫురిస్తోంది''
అని ఆగాడు సుబ్బారావు.

''చెప్పండి!'' అన్నాడు రాఘవరావు.

''హంతకుడు సామాన్యుడు కాడు. తన శక్తిసామర్థ్యాలను పోలీసులకు ప్రత్యేకంగా తెలియబర్చి ఓ సవాల్ పారేయాలనుకుంటున్నాడు,''

రాఘవరావు పిడికిళ్ళు బిగిశాయి ''అదే నిజమైతే వాడికి నిజంగా మూడింది.''

''అందుకే నా అనుమానం ఆ కత్తిని తీసుకువెళ్ళింది హంతకుడయుండడని'' అన్నాడు సుబ్బారావు.

రాఘవరావు చిత్రంగా సుబ్బారావు కళ్ళలోకిచూసి ''అయితే ఎవరయుంటారు? మీరా?'' అన్నాడు.

''ఎవరైనప్పటికీ బ్లాక్ మెయిలింగ్ కోసం ఆ పని చేసి వుండవచ్చు.''

రాఘవరావు నవ్వి ''జగన్నాథస్వామి హత్యకేసులో అనుమానితులు ముగ్గురు. ముగ్గురిలో ఏ ఒక్కణ్ని బ్లాక్ మెయిల్ చేసినా పదిపైసలుకూడా రావుమీకు''అన్నాడు.

''వాళ్ళు అనుమానితులు. అసలు హంతకుడు వేరే వున్నాడేమో - ఆ కత్తి అతణ్ని పట్టివ్వగలదేమో'' అన్నాడు సుబ్బారావు.

''మీరు గమనించారో లేదో మన వాదన మళ్ళీ మొదటికొచ్చింది'' అని గట్టిగా నవ్వాడు రాఘవరావు.

''కావాలనే అలా చేశాను. లేకపోతే నన్నే బ్లాక్ మెయిలర్ని చేస్తున్నారు మీరు'' అని తనూ నవ్వాడు సుబ్బారావు.

6

''అవు'' అందామె.

ఆటో ఆగలేదు. శరవేగంతో ముందుకు దూసుకు

పోతోంది.

"ఏయ్...నిన్నే...ఆపు" అందామె మళ్ళీ.

డ్రైవర్ ఆ మాటలు విన్నట్లులేదు. ఆటో వేగంకూడా తగ్గలేదు.

ఆమె కేక పెట్టింది కానీ ఆటో ఇంజన్ రొదను దాటి అది ఎంత దూరం వెళ్ళిందో తెలియదు. ఆమె కళ్ళల్లో భయం, శరీరంలో వణుకు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని కూర్చుంది.

ఊరి చివర పాడుపడ్డ ఆలయం దగ్గర ఆటో ఆగింది.

"ఏమిటి నీ వుద్దేశ్యం?" అని కోపంగా డ్రైవర్‌తో అంటూ ఆమె ఆటో దిగింది.

"నా ఉద్దేశ్యం చాలా సింపుల్. నన్ను పరిశీలనగా చూస్తే ఆ విషయం నువ్వే గ్రహిస్తావ్-లీలా!" అన్నాడతను.

"రామం" అంది కంగారుగా లీల "నువ్వా?"

"అవును-నేనే!" అన్నాడు రామం.

"నన్నెందు కిక్కడికి తీసుకొచ్చావ్?" అంది లీల.

"ఎందుకు తీసుకొస్తానో ఊహించలేవా?" అన్నాడు రామం.

"నాకు తెలిసిన రామం చాలా మంచివాడు. నన్ను మనసారా ప్రేమించి నా క్షేమాన్ని కోరుకునే వాడు. కలలోకూడా నాకు అపకారం తలపెట్టనివాడు" అంది లీల.

"అయితే ఆ రామాన్ని పెళ్ళి చేసుకుంటావా?"

"చేసుకోను. పెళ్ళి బాధ్యత నన్ను కని పెంచిన తలిదండ్రులకు వదిలిపెట్టాను. నిన్ను పెళ్ళి చేసుకోవడం నా తలిదండ్రుల కిష్టంలేదు. వారి కిష్టంలేని పని నేను చేయలేను."

"నేను నీ తలిదండ్రులు కావాలి. నాకు నువ్వు కావాలి. నీ తలిదండ్రులకోసం నువ్వు నన్నే త్యాగంచేశావు. నీ కోసం నేను ప్రాణాలకే తెగించి నిన్నిక్కడకు తీసుకు వచ్చాను" అన్నాడు రామం.

"ఎందుకు?"

"చాలా అమాయకంగా ఈ ప్రశ్న వేసినంత మాత్రాన నువ్వు అమాయకురాలివని నేను నమ్మను. అను కోకుండా ఐశ్వర్యవంతుల సంబంధం కుదరగానే మన ప్రేమపాఠాలన్నీ మరిచిపోయావు నువ్వు. మాయ మాట లతో నన్ను మభ్య పెట్టాలనుకుంటున్నావు. ఇప్పుడిక్కడ నీతో నాకు ఏం పనో నీకు బాగా తెలుసు" అన్నాడు రామం.

"నిజంగా తెలియదు. ఎంతో మంచివాడైన రామానికి రాత్రివేళ ఈ సమయంలో ఇలాంటి చోట నాతో ఏం పని వుంటుందో నా ఊహకూడా అందడంలేదు" అంది లీల.

"రామం ఎంతో మంచివాడని నువ్వే ఒప్పుకుంటు న్నావు కదా! అయితే నీ కళ్ళముందిప్పుడు నిలబడ్డది నీకు తెలియని రామం. నీకావలసిన రామాన్ని స్వార్థంతో నీకాకుండా చేసినట్లే-నీకు తెలిసిన రామం నీకు తెలి యని రామంగా మారడానికికూడా నువ్వే కారణం" అంటూ రామం ఆమె చేయి పట్టుకుని మీదకు లాక్కు న్నాడు.

"రామం ఏమిటిది?" అన్న లీలకు అతనింక మాట్లాడ డనీ చేతల్లోకి దిగాడనీ గ్రహించడానికి కొద్ది క్షణాలు కూడా పట్టలేదు. తన మానసంరక్షణార్థం ఆమె అతన్ని బలంగా తోసి పరుగెట్టింది.

"లీలా! పరుగులోకానీ, బలంలోకానీ నువ్వు నన్ను

గెలువలేవు. తప్పించుకోవడానికి ప్రయత్నించడంవల్ల నీ బట్టలు చిరిగిపోతాయి, నీ శరీరానికి గాయాలవుతాయి. అంతకు మించి ప్రయోజనం లేదు'' అంటూ లీలను హెచ్చరించాడు రామం. అతని హెచ్చరికను లీల లక్ష్యపెట్టలేదు. ఫలితంగా రామం చెప్పినట్లే జరిగింది.

''నీలో ఇంత దుర్మార్గం దాగి వుందని నేననుకోలేదు'' అంది లీల అక్కడ నేలమీద కూర్చుని ఏడుస్తూ.

''ప్రతి మనిషిలోనూ దుర్మార్గం వుంటుంది. అవసరాన్నిబట్టి అది బైటకు వస్తూంటుంది. నువ్వు నా పట్ల వహించిన దుర్మార్గంకంటే ఇది ఎక్కువ కాదులే!'' అన్నాడు రామం.

''ఇలా చేయడంవల్ల నీకు భార్య నౌతా ననుకున్నావా?'' అంది లీల ఉక్రోషంగా.

''నిన్ను భార్యగా పొందాలన్న కోరిక నీ కారణంగానే నాలో ఎప్పుడో చచ్చిపోయింది. కాబోయే లక్షాధికారిణితో ఈ మాత్రం పరిచయముండడం మంచిదనిపించి ఇలా చేశాను'' అన్నాడు రామం.

లీల మాట్లాడకుండా ఇంకా ఏడుస్తూ అలా కూర్చుని వుంది.

''ఏడ్చి లాభంలేదు. జరుగవలసింది జరిగిపోయింది. నీ మనసులో ఎలా వున్నా నీకారణంగా నాకు తృప్తి కలిగింది కాబట్టి చెబుతున్నాను. త్వరగా బట్టలు వేసుకో, ఆటోలో ఊళ్ళో దిగబెడతాను'' అన్నాడు రామం.

లీల కదలలేదు. ఆమె ఇంకా ఏడుస్తోంది.

''నేను త్వరగా ఆటోను స్వంతదారుకు అప్పజెప్పాలి. త్వరగా ఆటో ఎక్కు.''

లీలకు ఆ క్షణంలో భయం వేయలేదు. ఆమెకు చాలా ఉక్రోషంగా వుంది. తను సామాన్యుడిగా భావించి తీసి

పారేసిన రామం ఈరోజు తన్ను లోబరచుకుని లోకువ కట్టి మాట్లాడుతున్నాడు. ఆమెకు కాస్త పక్కగా ఆమె వంటిమీది బట్టలు కుప్పలా పడివున్నాయి.

"ప్రాణాలు తీయడంకంటె పెద్ద ఘోరమే చేశావు. ఇంకా ఏం భయపెడతావ్-పో-ఇక్కణ్నించి" అంది ఆమె వంచిన తల ఎత్తకుండా.

ఆ తర్వాత ఆమెకు రామం మాటలు వినబడలేదు. మరి కొద్ది క్షణాలలో ఆటో స్టార్టయిన శబ్దం వినబడింది. లీల ఉలిక్కిపడి తల ఎత్తింది. ఆమె చూస్తూండగా ఆటో కదిలి వెళ్ళిపోయింది.

అప్పుడు లీల ఉక్రోషం మరిచి ఈ లోకంలోకి వచ్చింది. పరిస్థితి ఆకళింపు అయిందామెకు. ఊరికి చిట్ట చివర నిర్మానుష్యమైనచోట పరువంలో వున్న ఓ పెళ్ళి కాని పిల్ల మానభంగం కావించబడి నగ్నంగా వుంది. శిథిలావస్థలో ఆమె దుస్తులు అక్కడ పడివున్నాయి. అక్కడ ఆమెకు తోడుగా ఇంకెవ్వరూ లేరు.

ఇప్పుడు తను ఏం చేయాలి?

లీల ఆలోచిస్తూనే వుంది. ఆమెకు ఏ ఉపాయమూ తోచడంలేదు. చిట్టచివరకు ఆమె ఎలాగో అలా అక్కణ్నించి నడిచైనాసరే ఊళ్ళోకి వెళ్లాలనుకుంది. ఆడదానికి మానభంగానికి మించిన ప్రమాదమేముంటుంది? అది ఎలాగూ తనకు జరుగనే జరిగింది ..

లీల లేచి నిలబడి తన బట్టలను సమీపించబోయి చటుక్కున ఆగిపోయింది. ఆమెకు కొంచెం దూరంలో ఎదురుగా ఒక పురుషుడు నిలబడి వున్నాడు. అతను రామం కాదు.

"వెరీగుడ్-చాలా బాగున్నావు" అన్నాడతను.

లీల కంపించుకుపోయింది. జీవితంలో ఇంత అవ

మానం తనకోరకై కాచుకుని వున్నదని ఆమె ఎన్నడూ ఊహించలేదు. తన బట్టలనందుకోవడం కోసం ఆమె మరో అడుగు ముందుకు వేయబోయి ఆగిపోయింది.

"ఆగు!" అన్నాడతను. ఆ కంఠస్వరం కఠినంగా వుంది.

లీల చటుక్కున చతికిలబడి "ఎవరున్నవ్వు?" అంది.

"నేనెవరైనదీ నీకు అనవసరం. నువ్వా బట్టలు వేసుకోవడం నాకిష్టంలేదు. కాబట్టి వేసుకోడానికి వీల్లేదు" అన్నాడు ఆ పురుషుడు.

"నీకు దణ్ణం పెడతాను. దురదృష్టం నన్నింతవరకూ తరుముకు వచ్చింది. ఈ అవమానానికే నేనింకా తట్టుకో లేకుండా వున్నాను. నువ్వు నా జోలికి వచ్చావంటే నా ప్రాణాలు తీసుకుంటాను" అంది లీల.

"ఛ ఛ-ఎంగిలి కూడుకు ఆశించే వాడికింద జమకట్టా వన్నమాట నన్ను..." అంటూ అతను విసుక్కుని- "నేనన్నదేమిటి - నువ్వర్థం చేసుకున్న దేమిటి?" అన్నాడు.

"మరి...మరి...బట్టలు వేసుకోకుండా ఇలా ఎంత సేపు..." ఏం మాట్లాడాలో తెలియక అక్కడితో ఆపి వేసి భయం భయంగా అతనివంక చూసింది లీల.

"నువ్వు పెద్దింటి అమ్మాయివి. అవి నలిగి చిరిగిన బట్టలు. నీలాంటివాళ్ళు అలాంటి బట్టలు వేసుకోవడం ఇష్టంలేక వద్దన్నాను కానీ నిన్ను బట్టలు వేసుకోవద్దన లేదు..." అంటూ అతను ఆమెపైకి ఒక ప్యాకెట్ విసిరాడు.

లీల ఆశ్చర్యంగా చూసింది. ఆ ప్యాకెట్లో ఒక చీర, లంగా, బ్లౌను, బ్రా వున్నాయి. ఆశ్చర్యమేమిటంటే

లంగా, బ్లౌను, బ్రా-కేవలం తనకోసం కొన్నట్లు చక్కగా సరిపోయాయి.

అతను లేచి ఆమెను సమీపించి-ఆమె పారవేసిన ప్లాస్టిక్ సంచీని తీసుకున్నాడు. నలిగి చిరిగిన ఆమె బట్ట లను వీలైనంతలో మడతపెట్టి ఆ ప్లాస్టిక్ సంచీలో పెట్టాడు. లీల ఆశ్చర్యంగా అతనివంక చూసింది.

"ఈ బట్టలు స్టీలుసామాను వాళ్ళుకూడా తీసుకోరు. నీకు కొత్త బట్టలిప్పించినందుకు ప్రతిఫలంగా వీటిని నేను తీసుకుంటున్నాను..." అన్నాడతను.

"ఏం చేసుకుంటావ్ వాటిని?" అంది లీల.

"కాబోయే లక్షాధికారిణి భార్యకు జరిగిన మానభంగా నికి ఇంతకంటె మంచి సాక్ష్యం వుంటుందా?" అని నవ్వాడతను.

లీల బెదిరిపోయింది. ఇదంతా ఏదో పెద్ద పథకంలా వుంది. తనకు లక్షాధికారి సంబంధం వచ్చిందన్న అసూయతో రామం ఈ పని చేశాడని తను అనుకుంది కానీ ముందుముందు తన జీవితాన్ని నరకప్రాయం చేయ డానికి జరుగుతున్న కుట్రగా గుర్తించలేకపోయింది.

"అర్థమైంది. ముందుముందు నన్ను బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజాలనుకుంటున్నారు. కానీ నేను సాగ నివ్వను. అసలా లక్షాధికారి సంబంధం కాదంటాను. పైసా లేనివాణ్ణి చూసి పెళ్ళిచేసుకుంటాను. అప్పుడు మీరు నన్ను చంపినా పైసాకూడా రాదు..." అంది లీల.

"నిప్పు కాలుతుందిగదా అని దాన్ని వంటచేసుకో డానికి ఉపయోగించడం మానేయడంవల్ల మాదేది నీ కడుపేనని తెలుసుకో..."

"ఎవరునువ్వు?" అంది లీల-"రామానికి బంటువా?"

అతని ముఖం గంభీరంగా అయిపోయింది_ "రామానికి నేను బంటునా అయితేగియితే, ఆ రామామే నాకు బంటు కావాలి!'' అన్నాడు.

"ఏదో ఒకటి_ మీ యిద్దరూ యెందుకు లాలూచీ అయ్యారు? రామంతో నీకు సంబంధం ఏమిటి?'' అంది లీల.

"నేను దేశసంచారం చేస్తూ నేరస్థుల ఇబ్బందులు తెలుసుకుంటూంటాను. నేరం చేయాలని వుండికూడా పరిస్థితుల ప్రాబల్యంవల్ల, మానసిక దౌర్బల్యంవల్ల నేరాలు చేయలేకపోతున్న వారికి అవసరమైన ధైర్యాన్నీ, ఆర్థిక బలాన్నీ సమకూర్చి వారిని నేరంవైపు పురికొల్పుతాను.

రామానికి నీ మీద పగతీర్చుకోవాలని చాలా కాలంగా వుంది. అది నేను పసిగట్టి అతన్ని ప్రోత్సహించి యీ రోజు మీ ఇద్దరికీ తొలిసమాగమం ఏర్పాటు చేసి మీ ఇద్దరికీ తెలియకుండా దూరాన్నుంచి గమనిస్తున్నాను. నీకు మళ్ళీ అమర్యాద లేకుండా వుండడంకోసం బట్టలతో సిద్ధంగా వున్నాను. ఇప్పుడు నిన్ను చూస్తుంటే ఆడది మామూలుగాకంటె బట్టల్లోనే ఎక్కువ అందంగా వుంటుందని అర్థమవుతోంది.

ఇప్పుడు నిన్ను చూస్తోంటే ఎంగిలికూడు అనిపించడం లేదు. నీలాంటిది భార్య అయితే బాగుండుననిపిస్తోంది. అయినా నిన్నేమీ చేయను. కాస్తదూరంలో నా కారుంది. నాతో వస్తే ఊళ్లో దిగబెడతాను. పిచ్చిపిచ్చి అనుమానాలేమీ పెట్టుకోక అనుకున్న సంబంధం హాయిగా చేసుకుని సుఖపడు. నావల్ల నీకేమీ ఇబ్బంది వుండదు'' అన్నాడతను.

"అయితే యిదంతా ఎందుకు చేశావు?'' అంది లీల.

"జస్ట్ ఫర్ ఫన్. ప్రపంచంలో నేరాలు వర్ధిల్లాలి అన్నది నా కోరిక. నా ఆశలమేరకు అవి వర్ధిల్లటం లేదన్నది నా బాధ" అన్నాడతను.

అతను ఎన్ని చెప్పినప్పటికీ బ్లాక్ మెయిలింగ్ అతని అసలు ఉద్దేశ్యమని లీల ఊహించింది. "నన్ను బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తే నేనైనా చస్తాను నిన్నైనా చంపుతాను" అంది.

"అంత పనిమాత్రం చేయను. నేను నీకు వస్త్రదానం చేసి ఆలనాటి శ్రీకృష్ణపరమాత్మను మించిపోయాను. నేను నీకు దైవసమానుణ్ణి. నీకు అన్యాయం చేసినది రామం. అతన్ని నువ్వు చంపాలనుకుంటే అది న్యాయం. ఎప్పుడైనా నీకు అటువంటి ఆలోచన పుడితే నాకు చెప్పకుండా మాత్రం చేయకు. ప్రమాదం లేకుండా హత్యలు చేయడానికి మంచి పథకాలున్నాయి నా దగ్గర" అన్నాడతను.

లీల అతని మాటలకు నివ్వెరబోయినా తమాయించుకుని "అలాగే నీ అడ్రసు చెప్పు" అంది.

"నాకు అడ్రసేమిటి?" అని అతను నవ్వి "ఏమీ యిబ్బంది వుండదు. హత్య చేయాలన్న ఆలోచన నీలో ప్రవేశిస్తే నేను నీకు ఎలాగూ కనబడతాను" అన్నాడు.

7

"ఎవరు?" అంటూ ఉలిక్కిపడి లేచాడు సుబ్బారావు.

"నేను బాబాయ్!" అంది లీల తడబడుతూ.

"నువ్వా-ఏంటమ్మా యింత ఆలస్యంగా వస్తున్నావ్" అంటూ అతను వీధి అరుగుమీద స్విచ్ వేశాడు. దీపం వెలిగింది. సుబ్బారావు కళ్ళు నులుముకుని ఒక పర్యాయం లీలవంక చూశాడు. ఆమెను చూడగానే అతనికి అన్న

కూతురుకు బదులు భార్య గుర్తుకువచ్చింది. లీలముఖంలో చాలా మార్పు వుంది.

"నువ్వు సాయంత్రం నాలుగున్నరకు ఇల్లువదిలిపెట్టావు. స్నేహితురాలితో మొదటిఆట సినిమాకు వెళ్ళి వచ్చేస్తానన్నావు. ఇప్పుడు రాత్రి పన్నెండయింది. మొదటిఆట వదిలిపెట్టి రెండున్నరగంటలకు పైగా అయింది. నీ ముఖం చూస్తుంటే సినిమాచూసి వస్తున్నట్లులేదు. వెళ్ళేటప్పుడు నువ్వు కట్టుకువెళ్ళిన బట్టలువేరు' ఇప్పుడు కట్టుకున్నవి వేరు. ఏదో జరిగింది" అన్నాడు సుబ్బారావు.

బాబాయి సంగతి లీలకు బాగా తెలుసును. అతను ఏ విషయాన్నీ వదిలిపెట్టడు. ప్రతివిషయాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి ఆలోచించి అసలుసంగతి ఊహాలో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తాడు. అతని కళ్ళబడడం తన దురదృష్టం.

"చెప్పు ఏం జరిగిందో" అన్నాడు సుబ్బారావు.

"ఏముంది బాబాయ్. స్నేహితురాలింటికి వెళ్ళాను. దానికి నా చీర నచ్చింది. దానిచీర నేనూ, నా చీర అదీ కట్టుకున్నాం. సినిమా అయేక కాసేపు వాళ్ళింట్లో గడిపాను. మాటల్లో టైం తెలియలేదు. అంతే_ దీనికి నువ్వు లక్షప్రశ్నలు వేస్తున్నావు" అంది లీల.

"ఎవరా స్నేహితురాలు?" అన్నాడు సుబ్బారావు.

సినిమాకు వెళ్ళడంకోసం ఇంట్లో స్నేహితురాలి పేరు చెప్పింది కానీ ఆమె సినిమా ఒంటరిగానే చూసింది. అందువల్ల ఆమెకు ఏం పేరు చెప్పాలో తెలియక చటుక్కున "నళిని!" అంది.

"అయితే నువ్వు చెప్పే దాంట్లో ఇంకా చాలా అబద్ధాలున్నాయి. నళిని లావులో నీకు రెట్టింపు ఉంటుంది. ఆమె జాకెట్ నీకు సరిపోదు. వెళ్ళేటప్పుడు అనుపచ్చ

చీరమీద మ్యాచింగ్ జాకెట్‌తో వెళ్లావు. వచ్చేటప్పుడు గులాబి రంగు చీరమీద మ్యాచింగ్ జాకెట్‌తో వస్తున్నావు. నిజం చెప్పాలంటే నీ చీర ఇప్పుడే బజార్నించి కొన్నట్టు లా ఉంది.'' అన్నాడు సుబ్బారావు.

''అయితే నన్నేం చేయమంటావ్!'' అంది లీల చిరాగ్గా.

సుబ్బారావు ముఖం గంభీరంగా అయిపోయింది. ''వీధిలో అనవలసిన మాటలు కావివి లీలా'' అంటూ అతను స్వరం తగ్గించి ''నీ ముఖం నిండా గాట్లు, రక్కులున్నాయి. నీ మెడమీద కూడా ఉన్నాయి. నువ్వు నా దగ్గర అబద్ధం చెప్పకు. జరిగింది జరిగినట్లు చెప్పేసేయ్. నేను నీకు బాబాయినే కానీ పరాయి వాణ్ని కాదు'' అన్నాడు.

వెంటనే లీల ముఖంమీద చేతులు కప్పుకుంది. ఆమెకు ఏడుపు వస్తున్నట్లు అతను గ్రహించాడు. భారంగా నిట్టూర్చి జేబులోంచి తాళంతీసి తలుపులు తెరిచి లోపలకు వెళ్ళాడు. లీల అతన్ని అనుసరించింది.

సుబ్బారావుకు వీధి అరుగుమీద పడుకోవడం అలవాటు. అటువంటప్పుడు అతను ఇంటికి తాళం పెట్టి తాళం చెవి జేబులో వేసుకుని నిద్రపోతాడు. ఆ కారణంగా లీలకు అతన్ని లేపక తప్పింది కాదు.

సుబ్బారావు లోపలకు వెళ్ళి భార్యను పిలిచి, లీల గురించి తనకున్న అనుమానాలు చెప్పి ''నిద్రపోయినప్పుడు లీల వళ్ళు పరీక్షించు. లాలించో, బెదిరించో లీలచేత నిజం పలికించు'' అన్నాడు. ఆమె సరేనన్నాక అతను మళ్ళీ వీధి అరుగుమీదకు వెళ్ళి తలుపు తాళంవేసి పడుకున్నాడు.

8

“రామం సంగతి అటుంచు- వాణ్ణేమీ చేయలేము. ఆ రెండో వాడి సంగతి ఆలోచించు. వాణ్ణి నువ్వు గుర్తు పట్టగలవా?” అన్నాడు సుబ్బారావు.

“గుర్తు పట్టగలను. ముఖం బాగా గుర్తుంది కానీ వాడు మనకు కనపడొద్దూ?” అంది లీల. రాత్రి జరిగిన ఘోరాన్ని పిన్నికి చెప్పుకున్నాక ఆమెకు మనసు కాస్త శాంతించింది. తల్లి వద్దకంటె పిన్నదగ్గరే ఆమెకు చనువు ఎక్కువ. పిన్ని ఉపశమనం వాక్యాలు చెప్పాక ఆమె మనసు మరి కాస్త తేలికపడింది.

“జరిగింది పూర్తిగా మరచిపో. ఇది నువ్వు కావాలని చేసిన తప్పుగాదు. అందుకు నిన్నే పాపమూ అంటదు. నువ్వు పరమపవిత్రురాలివి. ఎటొచ్చీ నిన్నలా భంగపరచి నీ భవిష్యత్తులో ఆడుకోవాలనుకుంటున్న ఆ వెధవ సంగతి తేల్చి పారేయాలి. ఇది నా ఊహా శక్తికి పరీక్ష......” అన్నాడు సుబ్బారావు లీలతో.

ఆ సందర్భంలో ఆమె నతను రకరకాల ప్రశ్నలు వేశాడు. తనకు తెలిసిన వాళ్ళ ఫోటోలూ, తను సేకరించిన నేరస్థుల ఫోటోలూ చూపించాడు. అందులో ఎక్కడా లీల బట్టలు తీసుకున్న మనిషి ఫోటో కనపడలేదు.

సుబ్బారావు బాగా ఆలోచించి “అన్నట్టు నీకు డ్రాయింగ్ వచ్చును కదూ” అన్నాడు.

“వచ్చును కానీ మనుషుల ముఖాలను యథాతథంగా చిత్రంచలేను” అంది లీల.

“చిత్ర లేఖనం రావాలి కానీ అదేం బ్రహ్మవిద్యకాదు,

నా బొమ్మ వేసి చూపించు.'' అన్నాడు సుబ్బారావు.

లీల సుబ్బారావుని ఎదురుగా పెట్టుకుని ఒక బొమ్మ వేసింది.

సుబ్బారావుకు ఆ బొమ్మను చూసి ఏడవాలో నవ్వాలో తెలియలేదు. ఎక్కడా తన పోలికలు రాలేదు. అతని భార్య మాత్రం ఆ బొమ్మ చూసి ఇలాంటి మనిషిని ఎక్కడో చూసినట్లుందండీ'' అంది.

"ఎక్కడో చూడ్డమేమిటి- అది బాబాయి బొమ్మ. అంత బాగా రాకపోయినా దగ్గర పోలికలుండి ఉంటాయి. అందుకే నీకు అలా అనిపించి ఉంటుంది'' అంది లీల శాస్త్ర గర్వంగా.

ఆమె పిన్ని మాత్రం లోపలకు వెళ్ళి అయిదు నిమిషాల్లో ఓ ఆల్బం తీసుకుని వచ్చింది.

ఆ ఆల్బంలో ఒక ఫొటోలోని వ్యక్తి అచ్చం లీల గీసిన ఫొటోలోని మనిషిలా ఉన్నాడు.

"ఏడాది! చాలా దూరపు వరుసలో నాకు తమ్ముడౌతాడు.'' అన్నాడు సుబ్బారావు.

"మొత్తంమీద మీ అమ్మాయి గట్టిదే. మిమ్మల్ని చూసి మీ బంధువర్గంలోని వాళ్ళ ఫొటో వేయగలిగింది.'' అంది సుబ్బారావు భార్య.

"భగవంతుడు సృష్టిలో కొత్తకొత్త పోలికలు తీసుకురావాలనుకున్నప్పుడు లీలవంటి చిత్రకారిణి సాయం తీసుకుంటాడనుకుంటాను'' అన్నాడు సుబ్బారావు. అతను జోక్ వేశాడనుకుని భార్య నవ్వింది కానీ అతని ముఖం చాలా సీరియస్‌గా ఉంది. ఆ దుర్మార్గుడెవరో తెలుసుకోవాలని అతనికి ఉంది. కానీ ఇప్పుడున్న అసహాయ పరిస్థితి అతని రక్తాన్ని మరిగిస్తోంది.

9

"రాఘవరావుగారూ నేను డిటెక్షన్ ప్రారంభిద్దామనుకుంటున్నాను." అన్నాడు సుబ్బారావు.

"ఎందుకని, మా పోలీసు డిపార్టుమెంటుమీద నమ్మకం లేకనా?" అన్నాడు రాఘవరావు.

"ఎంతమాట? పోలీసుల్ని తప్పుగా అనుకోవడానికి వాళ్ళేం దేవుళ్ళు కాదు కదండీ. మీరూ మాకులాంటి మనుషులే! మీ శక్తి కొద్దీ ప్రయత్నించి నేరస్తుల ఆచూకీ తెలుసుకుంటారు. నేరస్థులు మరీ తెలివి మీరిపోతుంటే మీరు మాత్రం ఏం చేయగలరు? నాకు కొంచెం ఊహా శక్తి ఉన్నది కదా! దాంతో డిటెక్షన్ చేసి ఉడతాభక్తిగా మీకు సాయపడాలని నేను అనుకుంటున్నాను." అన్నాడు సుబ్బారావు.

"చాలా థాంక్సండీ - మాకు సాయపడగలిగినా లేకున్నా మీరు మా గురించి ఓమాటన్నారు. అదే చాలు. ఇంతకీ మీ డిటెక్షన్ ఎట్నించి ప్రారంభిద్దామని?"

"ఇటీవల మీ అనుభవంలోకి వచ్చిన కేసుల్ని బట్టి నాకో చిన్న అనుమానం లేగింది. అది ఇదివరలో నే మీకు చెప్పి ఉన్నాను. ఓ కొత్త బ్లాక్ మెయిలర్ ఊళ్లో ప్రవేశించాడు. వాడు నేరస్తులపై ఓ కన్నువేసి ఉంచి వాళ్ళ బలహీనతలను ప్రోత్సహించి వాళ్ళచేత నేరాలు చేయిస్తున్నాడు. తర్వాత కొన్ని సాక్ష్యాధారాలు సంపాదించి బ్లాక్ మెయిలింగ్ కి ఉపయోగించుకుంటున్నాడు." అన్నాడు సుబ్బారావు.

"ఈ ఆలోచన అంతసమంజసంగా ఉన్నట్లులోచదు. జరిగిన అన్ని నేరాల్లోనూ బ్లాక్ మెయిలింగ్ కు అవకాశం ఉన్నదనిపించదు" అన్నాడు రాఘవరావు.

"అవుననుకోండి. మీతో నేనూ ఏకీభవిస్తున్నాను. కానీ అసలు విషయం తేలేవరకూ అలా అనుకుందాము. బ్లాక్ మెయిలింగ్ కోసం కాకపోయినా మరెందుకో ఆ వ్యక్తి సాక్ష్యాధారాలు కాజేస్తున్నాడు. అంటే ఇందులో మనకు రెండు విషయాలు అర్ధమవుతున్నాయి. నేరం జరగడానికి అతను ప్రోత్సహిస్తున్నాడు, నేరం జరిగాక నేరానికి సంబంధించిన సాక్ష్యాధారాలు దొంగిలిస్తున్నాడు. దీని ఆధారంగా హంతకుణ్ని నేను ట్రాప్ చేయాలనుకుంటున్నాను. అందుకు మీ సహకారం కావాలి."

"నా సహకారం మీకు తప్పకుండా వుంటుంది. కానీ ఒక్క ప్రశ్న. నేరం జరగడానికి అతనెవరో ప్రోత్సహిస్తున్నాడనీ, నేరం జరిగేక సాక్ష్యాధారాలు దొంగిలిస్తున్నాడనీ మీరెలా అనుకుంటున్నారు?"

ఇన్స్పెక్టర్ సూటిప్రశ్నకు సుబ్బారావు తడబడ్డాడు. అవును-తను అలా అనుకోడానికి కారణం లీల అనుభవం! అయితే ఆ విషయం పదిమందికీ చెప్పగలడా! అది తనకూ, లీలకూ, తన భార్యకూ మధ్య మగ్గిపోవలసిన భయంకర రహస్యం.

"ఇదంతా నా ఊహ" అన్నాడు సుబ్బారావు.

"మీరు నా దగ్గర ఏదో దాస్తున్నారు. ఏ ఊహకైనా ఏదో ఆధారముంటుంది. అది మీరు నాకు చెప్పడానికిష్టపడ్డంలేదు" అన్నాడు రాఘవరావు.

సుబ్బారావు అప్పటికి పుంజుకున్నాడు "ఏదైనా వింత కేసు తగిలితే దాని గురించి అదేపనిగా ఆలోచిస్తూంటాను నేను. అలాంటప్పుడు ఒకోపర్యాయం అనుకోకుండా వింత పరిష్కారాలు స్ఫురించవచ్చు. ఇంట్యూషన్ గురించి మీరు ఎరుగరనుకోను."

"మీ ట్రాప్ చెప్పండి" అన్నాడు రాఘవరావు.

"అమ్మయ్య దారికి వచ్చావు" అనుకున్నాడు సుబ్బారావు "చాలా సింపుల్. అయితే నాకొక్కడికి, మీకు! బహిరంగంగా ఎక్కడైనా నేరానికి ప్రయత్నం జరగాలి. తర్వాత నేరస్థుడు ఆ నేరాన్ని వాయిదా వేసుకుంటూ పోవాలి. వాయిదాలు వేసే ఆ నేరస్థుడివద్దకు మనం వెతుక్కుంటున్న నేరస్థుడు వస్తాడని నా అనుమానం. అదే జరిగితే ఎన్నో కేసులు పరిష్కారమవుతాయి."

"పథకం బాగుంది కానీ నాకు హోప్ లేదు" అన్నాడు రాఘవరావు.

సుబ్బారావు నవ్వి "ఆరంభింపరు నీచమానవులు" అంటూ పద్యం చదివాడు.

"మీరు పద్యం బాగాచదువుతారు. ఎటొచ్చీ తెలుగు నాకు బాగారాదు. అర్థం తెలియదు..." అన్నాడు రాఘవరావు.

"తెలియకపోవడమే మంచిది. కానీ నా పథకం ఫలించదేమోనని అనుమానం పెట్టుకుని మీరు గనుక ప్రయత్నించకపోతే ఈ పద్యానికి మీకు అర్థం చెప్పవలసి వుంటుంది" అన్నాడు సుబ్బారావు.

"ఇందులో పోయిందేముంది? చిన్న ట్రయల్. అంతేగా! చేసేస్తాను. మీ చేత ఆ పద్యానికి అర్థంమాత్రం చెప్పించుకోను" అని నవ్వాడు రాఘవరావు.

10

"అతనికి మీతో మాట్లాడ్డం ఇష్టంలేదుట" అన్నాడు రిసెప్షనిస్టు ఫోన్ క్రిందపెట్టేసి.

"అయినా సరే నేను మాట్లాడాలి. ఆ రూం దగ్గరకు వెడతాను" అన్నాడతను.

"మా కస్టమర్స్ ఇష్టపడనివాళ్ళను వాళ్ళ గదికి వెళ్ళ డానికి మేము అనుమతించం."

"విషయం చాలా సీరియస్ అవుతుంది. మీ కస్టమర్ పెద్ద నేరస్థుడు" అన్నాడతను.

"అయితే అవనీండి" అన్నాడు రిసెప్షనిస్టు నిర్లక్ష్యంగా.

అతను అసహనంగా "వాడు వాడు...ఆ కృష్ణయ్య గాడితో వున్నది నా భార్య. నా చేత స్వయంగా పుస్తె కట్టుకున్న పెళ్ళాం. వాడిదగ్గరకు నన్ను వెళ్ళొద్దంటే ఎలా?" అంటూ అరిచాడు.

రిసెప్షనిస్టు ఉలిక్కిపడి అతనివంక చూశాడు "చూడండి రమణయ్యగారూ, మీరు చెప్పేదినిజమేనా?"

"నిజం కాకపోతే నాకూ బాగా నేవుందేది. అయినా యిలాంటి అబద్ధాన్ని ఎవ్వడైనా చెప్పుకుంటాడా?" అన్నాడు రమణయ్య.

రిసెప్షనిస్టు మళ్ళీ రిసీవర్ ఎత్తి "హలో కృష్టయ్య గారూ, మీరోసారి క్రిందకు రాకతప్పదు. వచ్చేటప్పుడు మీ భార్యను కూడా తీసుకురండి" అన్నాడు. తర్వాత రమణయ్యవంక చూసి "వాళ్ళిద్దరూ వస్తున్నారు. ఏం మాట్లాడుకుంటారో నెమ్మదిగా మాట్లాడుకోండి. అనవ సరంగా కేకలువేసి రభసచేయకండి" అన్నాడు.

"అలాగే థాంక్స్" అన్నాడు రమణయ్య. అయితే కృష్ణయ్యనూ, అతని పక్కన స్త్రీనీ చూసేసరికి రమణయ్యలో ఆవేశం కట్టలు తెంచుకుంది. కృష్ణయ్య మాత్రం రమణయ్యను గమనించకుండా తిన్నగా రిసెప్ నిస్టు దగ్గరకు వెళ్ళి "ఎవరో నా కోసం వచ్చారన్నారు?" అని అడిగాడు.

"ఇదుగో ఈయనే రమణయ్యగారు" అన్నాడు రిసెప్షనిస్టు.

"నమస్కారమండీ— మీకు నాతో ఏం పని?" అని అడిగాడు కృష్ణయ్య మర్యాదగా.

"ఓరి వెధవా— నన్నే ప్రశ్న అడగడానికి నోరెలా వచ్చిందిరా?" అన్నాడు రమణయ్య.

"ఎవరు మీరు? మర్యాద ఇచ్చిపుచ్చుకోవడం కూడా తెలీదా?" అన్నాడు కృష్ణయ్య.

"నీకు మర్యాద యిచ్చేకదా యీ పరిస్థితి తెచ్చుకున్నాను. ఇంకా అలాంటి తెలివితక్కువపని చేయను" అంటూ రమణయ్య అతని వెనుకగావున్న స్త్రీని వుద్దేశించి "ఏమే, ఇద్దరుపిల్లల తల్లివి. ఇప్పుడు నీకు రంకు మొగుడు కావాల్సొచ్చిందేంటే— అక్కడ పిల్లలెలాగున్నారన్న ఏడుపైనా లేదు నీకు. అయిందేదో అయింది. ఇప్పుడైనా నాతో వస్తావా?" అని అడిగాడు.

"మీరెవరో నాకు తెలియదు" అందా స్త్రీ.

"ఎంతకు బరితెగించిపోయావే దొంగముండా! నీ కొడుకక్కడ నీ కోసం బెంగపెట్టుకుని మూసినకన్నెర క్కుండా పడున్నాడే. కన్నకడుపైనా ఆక్రోశించడం లేదా?" అన్నాడు రమణయ్య.

"నిజంగానా?" అందా స్త్రీ గాభరాగా.

"నమ్మకు మీనాక్షీ! వీడివన్నీ అబద్ధాలు. నిన్ను మళ్ళీ మాయలో పడేయాలని చూస్తున్నాడు" అన్నాడు కృష్ణయ్య.

రమణయ్యకు ఆవేశం కట్టలు తెంచుకుంది. బూతులు కూడా లంకించుకున్నాడు. అతడిని అదుపులో పెట్టడం కష్టమైంది. అతని కేకలకు అప్పటికి అక్కడ కొందరు

జనం చేరారు. వారందరికీ కృష్ణయ్య నెమ్మదిగా యిలా చెప్పారున్నాడు.

"చూడండి బాబూ, ఈమె పేరు మీనాక్షి. ఈమె నా భార్యకాదు. ఈమెను భార్యగా చేసుకునే వుద్దేశం కూడా నాకులేదు. నేను యీ రమణయ్య యింట్లో అద్దె కుంటున్నాము. యీ రమణయ్య తాగుబోతు' పెళ్ళాన్ని అష్టకష్టాలు పెడుతున్నాడు. రాక్షసుడిలా హింసిస్తున్నాడు. ఈయన పెట్టేబాధలు భరించలేక ఈమె ఆత్మహత్య చేసుకోబోగా నేను రక్షిస్తే మా ఇద్దరికీ సంబంధం పెట్టాడు. అక్కా_తమ్ముళ్ళలా మసలుతున్న మా యిద్దరికీ సంబంధం అంటగట్టిన ఈయన నోటికి అదుపులేదు. ఆఖరికి యింకోదారి కనిపించక ఈమెను ఆ ఇంటినుంచి తీసుకువచ్చేశాను.

ఈమె దగ్గర నగలులేవు, డబ్బులేదు. ఈమె వయసులో నాకంటె మూడేళ్ళు పెద్దది. నా మంచితనాన్ని నిరూపించడానికివి చాలు. ఒక ఆడా, మగా హోటల్ గదిలో అక్కా_తమ్ముళ్ళ పేరిట గది తీసుకుంటే హాస్యాస్పదంగా వుంటుందని భార్యాభర్తలమని చెప్పుకుని ఇందులో దిగాము. ఎంత విసిగిపోతే ఒకఆడది అందులోనూ భారతదేశపుస్త్రీ, కన్నబిడ్డలనూ, కట్టుకున్న మొగుణ్ణీ వదులుకుని వెళ్ళిపోతుంది? ఇప్పుడీయన మా జాడ పసిగట్టి ఇక్క_డకువచ్చేసి మమ్మల్ని అల్లరిపెట్టాలని చూస్తున్నాడు. ఇప్పుడీమెని వదిలిపెడితే ఈమెను చంపేస్తాడు" అంటూ అందరికీ హృదయం కరిగేలా కృష్ణయ్య కథను చెప్పాడు.

అతను చెబుతూంటే మీనాక్షి అతనికి బలాన్నిచ్చింది. రమణయ్య మధ్యలో కలుగజేసుకోబోయాడు కానీ జనం అతన్ని మాట్లాడనివ్వలేదు. కృష్ణయ్య కథ చెప్పడం

పూర్తయ్యాక అక్కడున్న అందరికీ మీనాక్షిమీద అంతులేని జాలి కలిగింది. కృష్ణయ్యపై గౌరవం కలిగింది. అందరూ ఏకగ్రీవంగా రమణయ్యను అక్కణ్ణించి పొమ్మన్నారు.

రమణయ్య నిస్సహాయంగా అక్కణ్ణించి కదులూతూ "మీ ఇద్దరికీ మూడింది. నా చేతుల్లో మీ చావు రాసిపెట్టి వుంది. ఈ వేళ కాకపోతే రేపు" అన్నాడు.

11

"నీ పేరేనా రమణయ్యా?" అన్నాడతను.

"నా పేరేమైతే నీకెందుకు?" అన్నాడు రమణయ్య చిరాగ్గా.

"పెళ్ళాం లేచిపోయి హోటల్లో మరొకడితో కులుకుతూంటే ఏమీ చేయలేక ఆ హోటల్ ముందు కాపలా వాడిలా పచార్లుచేసే నువ్వు నామీద చిరుకుపడతావేం?" అన్నాడతను కోపంగా.

రమణయ్యకు పిడికిళ్ళు బిగిశాయి. పళ్ళు కొరికాడు.

"అనవసరంగా ఆవేశపడకు. నేను నీ మిత్రుణ్ని" అన్నాడతను.

"ఎలా?" అన్నాడు రమణయ్య.

"నువ్వు ఏం చేయాలనుకుంటున్నావో నేనూ నీచేత అదే చేయించాలనుకుంటున్నాననుకో. అప్పుడు మన మిద్దరం స్నేహితులం కాక ఏమవుతాం?" అన్నాడతను.

"నీ పేరు?"

"పిలవడానికి ఏదో ఒక పేరు అవసరం కాబట్టి చెబుతాను. వీర్రాజు" అన్నాడతను.

"వీర్రాజుగారూ_అయితే నేనేం చేయాలనుకుంటున్నానో, మీరేం చేయించాలనుకుంటున్నారో చెప్పండి.'

"మర్డర్ - కృష్ణయ్యనూ, మీనాక్షినీ!" అన్నాడు వీర్రాజు.

రమణయ్య పిడికిళ్ళు మళ్ళీ బిగిశాయి—"అవును" అన్నాడు.

"హత్యలోనూ మామూలు హత్యకాదు. భయంకరమైన హత్య. నీ కసితీరేవిధంగా వాళ్ళిద్దర్నీ హింసించి చంపవచ్చు. హత్యజరిగేక నీమీద ఎవరికీ అనుమానముండదు."

"అలా సాధ్యపడుతుందా?" అన్నాడు రమణయ్య అనుమానంగా.

"నీకు దృఢసంకల్పముండాలి కానీ తప్పక సాధ్యపడుతుంది"

"నేను రెడీ...ఏంచేయాలో చెప్పండి."

"తెలుసుకోవాలంటే హోటల్ శివశంకర్‌లో పదిహేడో నంబరుగదికి వెళ్ళు" అన్నాడు వీర్రాజు.

రమణయ్య వెంటనే అక్కణ్నించి బయల్దేరాడు. కొంతదూరం నడిచి ఒక ఆటోఎక్కి "శివశంకర్ హోటల్‌కు పోనీ" అన్నాడు. ఆటో కదిలింది.

ఆటో ఏవేవో సందులు, గొందులు తిరిగి ఒక పెంకుటింటిముందు ఆగింది.

"ఇదేమిటి, ఇక్కడ ఆపావ్?" అన్నాడు రమణయ్య.

"మీరు శివశంకర్ హోటల్ అన్నారు కదా" అన్నాడు ఆటోవాలా.

రమణయ్య ఆశ్చర్యంగా ఇంటివైపు చూశాడు. వీధి గుమ్మానికి "శివశంకర్ హోటల్" అన్న బోర్డు తగిలించి వుంది.

"ఇదా హోటలు?" అన్నాడు రమణయ్య.

"నాకు తెలిసిన శివశంకర్ హోటల్ ఇదే!" అన్నాడు ఆటోవాలా.

"ఇందులో పదిహేడు గదులుంటాయా?"

"పాతిక్కి పైనే వున్నాయనుకుంటాను. ఎన్నుంటే మీకేం- మీ ఒక్కరికీ వొరికితే చాలుగదా" అన్నాడు ఆటోవాలా.

రమణయ్య ఆటోవాలాకు డబ్బిచ్చి పెంకుటింటి తలుపు తట్టాడు. బాగా ఎత్తుగా పళ్ళున్న ఓ భయంకరాకారుడు తలుపు తీశాడు. రమణయ్య ఆ వ్యక్తిని చూసి ఉలిక్కి పడ్డాడు.

"రూమ్ నెంబరు పదిహేడు కావాలి" అన్నాడు రమణయ్య.

"అలాగే...లోపలకు రా..." అన్నాడు ఎత్తుపళ్ళ వ్యక్తి.

రమణయ్య లోపలకు ప్రవేశించాడు. ఆటోవాలా వెళ్ళిపోయాడు—ఎత్తుపళ్ళవ్య వ్యక్తి కనుసైగలందుకుని.

"ఇదేం హోటలు?" అన్నాడు రమణయ్య.

"నిజమే. ఇది హోటలుకాదు. ఇప్పుడు నువ్వు వెళ్ళబోయేచోటు నీకూ తెలియకూడదు." అన్నాడు ఎత్తుపళ్ళ వ్యక్తి. అతని మాటలు పూర్తయ్యేసరికి రమణయ్య స్పృహాకోల్పోయాడు.

12

రమణయ్య కళ్ళు తెరిచేసరికి ఓ గదిలో ఉన్నాడు. అక్కడ అతనికి ఒక మనిషి కనిపించాడు.

"నాపేరు వీర్రాజు కాదు. కానీ మరి కాసేపట్లో నీ భార్యా, ఆమె రెండు మొగుడూ ఇక్కడకు వస్తారు. వాళ్ళు నిస్సహాయ స్థితిలో ఉంటారు. నీకు తోచిన రీతిని వాళ్ళను హింసించి చంపేయ్. నిన్నెవ్వరూ అడ్డలేరు," అన్నాడతను.

"ఎవరు మీరు?" అన్నాడు రమణయ్య.

"నేరస్థులకు సాయపడ్డం నా హాబీ." అని నవ్వాడతను.

"నేనిప్పుడెక్కడున్నాను?"

"నీ కోరిక తీరేచోట."

"నా కోరిక ఏమిటి?"!

"పగ సాధించడం."

"నాకు ఎవ్వరిమీదా పగలేదు. నేను ఎవ్వర్నీ చంపలేను."

"రమణయ్యా. అనవసరంగా చల్లారిపోకు. నీ గుండెల్ని మండించే దృశ్యం చూద్దువుగాని.అప్పుడు నీలో ఎటువంటి భావాలు రేగుతాయోచూడు. మనిషి మనసును అన్నిసమయాల్లోనూ అదుపు చేసుకోనవసరంలేదు." అన్నాడతను. అతని మాటలు పూర్తయ్యేసరికి మళ్ళీ రమణయ్యకు స్పృహ తప్పింది.

అతను అక్కణ్నించి పక్క గదిలోకి వెళ్ళి వాచీవైపు చూసుకుంటూ కూర్చున్నాడు. సరిగ్గా నలభై అయిదు నిమిషాలలో అక్కడకు కృష్ణయ్య, మీనాక్షి ప్రవేశపెట్టబడ్డారు. వాళ్ళను చూస్తూనే అతను "నేను చెప్పినట్లు వినకపోతే మీరిద్దరూ ఒకే క్షణంలో చచ్చిపోతారు." అన్నాడు.

"ఏమిటి నువ్వు చెప్పేది?" అన్నాడు కృష్ణయ్య.

"ఈ గదిలో ఎవ్వరూ ఉండరు. మీరిద్దరే ఉంటారు. హాయిగా భార్యాభర్తల్లా విహరించండి. అదే మీరు చేయవలసిన పని."

"ఏమిటి మీరనేది? ఈ మీనాక్షి నాకు అక్కవంటిది." అన్నాడు కృష్ణయ్య.

"యూ ఫూల్ - నేను వరుసల గురించి అడగలేదు. చెప్పి

నట్లు విను. నేను గదిలోంచి బయటకు వెళ్ళగానే మీరు ఒకరి నొకరు కౌగలించుకోండి. లేదా ఇద్దరి గుండెల్లోంచీ తుపాకీ గుళ్ళు దూసుకుపోతాయి.'' అన్నాడతను.

అతను వేళాకోళ మాడడంలేదని కృష్ణయ్యాకూ, మీనాక్షికీకూడా అర్థమయింది.

13

మీనాక్షి కౌగలిలో ఉన్న కృష్ణయ్యను రమణయ్య ఇవతలి గదిలోంచి చూస్తున్నాడు.

''నువ్వు తమను గమనిస్తున్నట్లు వాళ్ళకు తెలియదు. వాళ్ళను మాయమాటలుచెప్పి ఇక్కడకు తీసుకువచ్చాను. క్షణం వ్యవధి వచ్చేసరికి వాళ్ళ ప్రవర్తన ఎలాగుందో చూడు.''

రమణయ్య గుటకలు మింగుతూ-''నా భార్య నాతో ఇంత ఆదరణగా ఎన్నడూ ప్రవర్తించలేదు. వాటంచూస్తే అది నిజంగానే వాణ్ని ప్రేమిస్తున్నట్లుంది. అంతగా ప్రేమించుకున్న వాళ్ళను కలిసే ఉండనివ్వండి. నాకింకో పెళ్ళాం దొరక్కపోదు.'' అన్నాడు.

అతను అసహనంగా రమణయ్య వంక చూసి-''నువ్వు తాళికట్టిన భార్య ఇంకోడి చేతుల్లో నలుగుతూంటే నీలో రక్తం మరగడంలేదు. వాళ్ళిద్దరూ ఇప్పుడు అసహాయులు. నువ్వేం చేసినా ఎదుర్కోలేరు. వాళ్ళను ఏదైనాచేయాలనిపించడంలేదూ?'' అన్నాడు.

''లేదు. వాళ్ళ మానాన వాళ్ళను బ్రతకనివ్వాలనిపిస్తోంది.'' అన్నాడు రమణయ్య.

అతను ఆశ్చర్యంగా రమణయ్య వంకచూసి-''నువ్వు. నువ్వు...నిజంగా మీనాక్షికి భర్తవేనా?'' అన్నాడు.

''అవును. అదంటే నాకు వల్లమాలిన ప్రేమ. ఎప్పు

డైనా ఆవేశంలో దాన్ని కోప్పడినా దాని ప్రాణాలు తియ్యలేను. అది సుఖంగా ఉండడమే నాక్కావలసింది.'' అన్నాడు రమణయ్య.

''నువ్వు అలా అనుకోవడానికి వీల్లేదు. వాళ్ళను చంపాలి.''

రమణయ్య ఆశ్చర్యంగా అతని వంక చూసి-''నాకు లేని ఆవేశం మీకెందుకు బాబూ—మీనాక్షివల్ల అన్యాయం జరిగితే అది నాకు జరిగింది. నేను సహిస్తాను...'' అన్నాడు.

''కానీ నేను సహించను. నువ్వు వాళ్ళను చంపి తీరాలి.'' అతను అరిచాడు.

''చంపలేను బాబూ—నాకు చేతులురావు.''

''వాళ్ళను చంపని పక్షంలో నువ్వే చస్తావ్!'' అన్నాడను.

రమణయ్య ఉలిక్కిపడ్డాడు--''ఇదెక్కడి విచిత్రం బాబూ-నన్ను హత్యచేయమని బలవంత పెడతారు?''

''నీ ఆవేశం చూసి మోసపోయి అన్ని ఏర్పాట్లూ చేశాను. కానీ నువ్వు వట్టి చచ్చు రకంలా ఉన్నావు. నా అనుభవంలో ఇలా జరగడం ఇదే ప్రథమం. అనుకున్న ప్రకారం నువ్వు నీవాళ్ళను చంపితే ఇక్కణ్ణుంచి బయటపడతావు. లేకపోతే ఇక్కడే నీబ్రతుకు అంతమవుతుంది.''

''వాళ్ళను చంపడంవల్ల మీకేమిటి లాభం?''

''దానికి జవాబు అతనివ్వలేడు రమణయ్యా నేను చెబుతాను.'' అంటూ ఒక వ్యక్తి లోపలకు వచ్చాడు.

లోపలున్న ఇద్దరూ ఆ వ్యక్తికేసి ఆశ్చర్యంగా చూశారు.

14

సుబ్బారావు ఎవరికీ తెలియకుండా రమణయ్యమీద పూర్తి నిఘా వేసి ఉంచాడు. వీరరాజు మాట్లాడిన విషయాలన్నీ అతను విన్నాడు. వీరరాజును పోలీసులు అనుసరిస్తారని అతనికి తెలుసు. అందుకే అతను రమణయ్య అనుభవాలు తెలుసుకో దలిచాడు.

రమణయ్య ఆటో ఎక్కగానే తన స్కూటరుపై అతను దాన్ని అనుసరించాడు. ఆటో ఇరుకు వీధులమ్మట వెళ్ళడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించినా ఎవరికీ అనుమానంరాని విధంగా దాన్ననుసరించాడతను. ఒక సామాన్యమైన ఇంటిలోకి రమణయ్య ప్రవేశించడం సుబ్బారావుకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అతనా ఇంటికి ప్రదక్షిణంచేసి చూసి ఆ ఇంటినుంచి బయటపడడానికి ముఖద్వారంకాక మరొకటున్నదని గ్రహించాడు. అనువుగా ఉన్న ఒక ప్రదేశాన్ని ఎన్నుకుని అక్కణ్ణించి రెండు ద్వారాలనూ పరిశీలించసాగాడు.

కాసేపటికి ఆ రెండవద్వారం నుంచి ఒక మనిషి బయటకు వచ్చాడు. అవతల ఒక కారు సిద్ధంగా వుంది. ఆ మనిషి కారుడ్రైవర్‌తో ఏమేమో మాట్లాడాడు. డ్రైవర్ కారుదిగి ఆ మనిషిని అనుసరించాడు. ఇద్దరూ మళ్ళీ ఇంట్లోకి వెళ్ళి కొద్దినిముషాల్లోనే మూడోమనిషితో తిరిగివచ్చారు. ఆ మనిషికి స్పృహ వున్నట్లులేదు. స్పృహ లేని ఆ మనిషి రమణయ్యయుండొచ్చునని సుబ్బారావు ఊహించాడు.

వాళ్ళిద్దరూ రమణయ్యను కారు వెనకసీట్లో పడుకో బెట్టారు. ఇద్దరూ ముందుసీట్లో కూర్చున్నారు. కారు కదిలింది. సుబ్బారావు స్కూటర్ కూడా కదిలింది.

అనుభవం లేకపోయినా సుబ్బారావు కారును బాగానే అనుసరించగలిగాడు. ఆ కార్లో వాళ్ళు తమ నెవరో అనుసరిస్తున్నట్లు అనుమానించలేదు. కారు నెమ్మదిగా, సాఫీగా సాగింది. సుబ్బారావు సావకాశంగా దానిననుసరిస్తున్నాడు.

ఆఖరికి కారు ఒక బంగళాముందు ఆగింది. కారులోని వ్యక్తిలిద్దరూ దిగి రమణయ్యను బంగళాలోకి మోసుకుని వెళ్ళారు. కాసేపు ఆగి ఆ బంగళా ముందుకు వెళ్ళాడు సుబ్బారావు. అది ఒక ప్రైవేట్ నర్సింగ్ హోం-పేరు శాంతి. డాక్టర్ పేరు కరుణాకరం.

కారులోని వ్యక్తులు రమణయ్యను మోసుకుంటూ నిర్భయంగా ఎలా వెళ్ళగలిగారో సుబ్బారావుకు అర్థమైంది. అతను కాసేపు అటూ ఇటూ తచ్చాడాడు. ఏమేమో ఆలోచించాడు. ఈ నర్సింగ్ హోంకూ కొన్ని నేరాలకూ సంబంధముండి తీరాలని అతనికి అనిపించింది.

ఓ పావుగంట గడిచేక సుబ్బారావు సమీపంలోవున్న ఓ కాఫీహోటల్కు వెళ్ళి-శాంతి నర్సింగ్ హోం గురించి వాకబుచేశాడు. ఆ నర్సింగ్ హోం అక్కడ అయిదారు సంవత్సరాలుగా వుంటున్నదనీ పేషెంట్లను చేర్చుకోవడం అరుదుగా జరుగుతూంటుందనీ అతనికి తెలిసింది. రోజూ సాయంత్రం నాలుగు నుంచి అయిదు వరకు మాత్రం ఔట్ పేషెంట్సు వచ్చివెడతాడు. అవే కన్సల్టింగ్ అవర్స్.

"కొన్ని ప్రైవేట్ విషయాలు ఫోన్లో మాట్లాడాలి. ఇక్కడ వీలవుతుందా?" అనడిగాడు సుబ్బారావు. హోటల్ యజమాని పక్కనేవున్న గది చూపించి "మీ ఇష్టం వచ్చినంత సేపు మాట్లాడండి. కాల్కు అర్థరూపాయి చొప్పున ఫోన్కు ఏర్పాటుచేసిన హోల్లో

వేయాలి. అదికాక స్పెషల్ రూం ఛార్జస్ పావుగంటకు రెండురూపాయలు అదనం'' అన్నాడు.

ఈసదుపాయం బాగున్నదని తోచింది సుబ్బారావుకు. అతను ఆ గదిలోకి వెళ్ళి ఇన్‌స్పెక్టర్ రాఘవకు ఫోన్ చేసి తన అనుభవం చెప్పి శాంతి నర్సింగ్ హోంను సోదా చేస్తే కొన్ని నేరాలు బయట పడవచ్చునని చెప్పాడు. పోలీసులు మఫ్టీలో వస్తే చుట్టు పక్కలవారికి ఏవిధమైన అనుమానమూ ఉండదనీ ప్రస్తుతానికి అది అవసరమని తన ఊహాశక్తికి తోస్తున్నదనీ చెప్పాడు. రాఘవరావు ఫోన్‌లో అతనికి ధన్యవాదాలు చెప్పాడు.

సుబ్బారావు అక్కణ్నించి బయటపడి హోటల్ అతనికి డబ్బు పే చేసి మళ్ళీ వీధిలోకి వచ్చాడు. ఇప్పుడు తను ఏం చేయాలా అని ఆలోచిస్తూండగా ఎవరో అతన్ని పలకరించారు.

''మే ఐ నో యువర్ గుడ్ నేమ్ ప్లీజ్!''

సుబ్బారావు అతని వంక ఆశ్చర్యంగా చూసి_''నా పేరు సుబ్బారావు. మీకు తెలుగువచ్చా!'' అన్నాడు.

''నాకు తెలుగు బాగావచ్చు. నా పేరు కరుణాకరం.'' అన్నాడతను.

''కరుణాకరం అంటే?''

''డాక్టర్ కరుణాకరం. శాంతి నర్సింగ్ హోం నాదే...''

''అయ్‌సీ...''అని ఆగి_''నాతో మీకు పని ఉందా?'' అన్నాడు సుబ్బారావు.

''ఉంది. ఇందాకా మీరు హోటల్ రూంలో ప్రైవేట్‌గా టెలిఫోన్ చేశారే. ఆ సంభాషణంతా నేను విన్నాను...'' అని నవ్వాడతను.

15

"ఎవరు మీరు?" అన్నాడతను.

"నేనెవరో రమణయ్య నడిగితే చెబుతాడు..." అంటూ నవ్వాడా కొత్త వ్యక్తి.

"ఇన్‌స్పెక్టరు రాఘవరావుగారా..." అన్నాడు రమణయ్య.

"అవును మఫ్టీలో వచ్చాను" అన్నాడు రాఘవరావు.

అతను కంగారు పడుతూ_"మీకిక్కడ ఏం పని?" అన్నాడు.

"నిజానికి మాకిక్కడ ఏ పనీ లేదు. నువ్వు నాకు పని కల్పించావు. ఒక విధమైన క్రూర పైశాచిక మనస్తత్వం నిన్నావహించగా_ఏదో బలహీన క్షణంలో నేరం చేయాలని అనుకున్న కొందరు దౌర్భాగ్యులను చేరదీసి, ప్రోత్సహించి_వాళ్ళచేత నేరం చేయించి_నీ కళ్ళముందే జరిగిన ఆ నేరాన్ని చూసి ఆనందిస్తున్నావు. నేరాలకు సాక్ష్యాధారాలు నీవద్దనే ఉంచుకుని ఆ నేరస్థులను బెదిరిస్తున్నావు. కావాలనుకున్నప్పుడల్లా వాళ్ళచేత నేరాలు చేయించడం కోసం ఈ ఆధారాల నుపయోగించుకుంటున్నావు." అన్నాడు రాఘవరావు.

"ఇదంతా మీ ఊహ. ఇలాంటి ఊహ మీకెందుకు వచ్చిందో నాకు తెలియడంలేదు." అన్నాడతను.

"ఇది ఊహకాదు, వాస్తవం. అందుకు ఈ రమణయ్యే సాక్షి. రమణయ్య, కృష్ణయ్య, మీనాక్షి_మేము నియోగించిన మనుషులు. నిన్ను అనుమానించి బయటపెట్టడం కోసం మేమాడిన నాటకం ఫలించింది." అన్నాడు రాఘవరావు.

అతని మాటలు పూర్తికాగానే అక్కడున్న మనిషి అదే పనిగా నవ్వసాగాడు. "రాఘవరావుగారూ-మీ ఊహ పెడత్రోవ పట్టింది. మీరు మమ్మల్ని తప్పుగా అర్థంచేసుకున్నారు. నిజానికి మేమొక సినిమా తీస్తున్నాం. సినిమా పేరు చంపకపోతే చస్తావ్! ఈ సినిమా టైటిల్సుకు ముందు ఒక వాస్తవిక సన్నివేశాన్ని ప్రవేశపెట్టాలనుకున్నాం. పేపర్లో రమణయ్య, కృష్ణయ్యల గురించి చదివి ఆ సన్నివేశం వీరిచేత నటింపజేయాలనుకున్నాం. ఈ సన్నివేశంలో తన భార్య మరొకడితో చనువుగా ఉండడం చూసి ఒకడు ఆవేశపడి హత్యచేస్తాడు. రమణయ్య, కృష్ణయ్య, మీనాక్షిలకు ముందు ఈ విషయం చెప్పకపోవడం ద్వారా సన్నివేశం సహజంగా తయారవుతుందనుకున్నాం. అయితే కథ తప్పుదారిలో వెళ్ళింది.

అతను తన కథను నిజమని నిరూపించడానికి ఆ గదిలో ఉన్న ఏర్పాట్లు చూపించాడు. అక్కడా, ఆ పక్క గదిలోనూ ఉన్నవి బొమ్మ తుపాకులు, బొమ్మ పిస్తోళ్ళు. గదిలో మూవీ కెమేరా ఉంది.

"నేను నమ్మలేను." అన్నాడు రాఘవరావు.

"మీరు నమ్మినా నమ్మకపోయినా ఈ విషయాలు బయటి ప్రపంచానికి చెప్పవద్దు. మా సినిమా ఎలా తయారవుతున్నదీ ఎవరికీ తెలియకూడదు." అన్నాడతను.

"ఏమైనా మిమ్మల్ని అరెస్టు చేయక తప్పదు. ముగ్గురు మనుషుల్ని ఎత్తుకుని వచ్చారు మీరు." అన్నాడు రాఘవరావు.

"విషయాలన్నీ రహస్యంగా ఉంచితే మీరనుకునే నేరస్థుల్ని బయటపెట్టడానికి కృష్ణయ్య, మీనాక్షి, రమణయ్య ఇంకా పనికొస్తారు. అందువల్ల మీకే ప్రయోజనం?" అన్నాడతను.

16

సుబ్బారావుకు ముచ్చెమటలు పోశాయి.

కరుణాకరం, సుబ్బారావు వంక చూసి, "అయినా నాకు మీపైన కోపంలేదు. ఎందుకంటే అడ్వాన్సుగా మీ సంభాషణంతా విన్నాను. కాబట్టి అడ్వాన్సుగా మా వాళ్ళకు సంకేతాలుగూడా ఇచ్చేశాను. అవసరమైన జాగ్రత్తలు వాళ్ళు పడుతున్నారు. పోలీసులవల్ల వాళ్ళకే ఇబ్బందీ ఉండదు. ఎటొచ్చీ ఇంక నేను మీ గురించి తెలుసుకోవలసి ఉంది. ఎవరు మీరు. పోలీసు ఆఫీసరా?" అన్నాడు.

"కాదు. కానీ బాధ్యతగల సామాన్య పౌరుణ్ని." అన్నాడు సుబ్బారావు.

"మీకు కుక్క, గాడిద కథ తెలియదనుకుంటాను. యజమాని ఇంట్లో దొంగ పడుతూంటే కుక్క చూస్తూ ఊరుకుందిట. గాడిద గుర్తుచేసినా అది తన బాధ్యతను నిర్వహించనని మొండికేసి కూర్చుందిట. అప్పుడు కుక్క బాధ్యతను కూడా తనే నిర్వహిద్దామని గాడిద ఓండ్ర పెడితే—యజమాని కోపంగా నిద్రలేచి గాడిదను చావ బాదాడట. ఈ కథలోని నీతి ఏంటంటే ఇతరుల బాధ్యతను మనం స్వీకరించకూడదని. అర్థమయిందా?"

సుబ్బారావు ముఖం మాడిపోయింది. అయినా అతను నెమ్మదిగా—"ఇందులో నా స్వంత బాధ్యతకూడా ఉంది" అన్నాడు.

"ఏమిటది?"

"చెప్పను."

కరుణాకరం నవ్వి-"అది నువ్వు చెప్పలేవని నాకు తెలుసు. నాతోకూడా వస్తే - నువ్వెంత బాధ్యతారహి

తంగా ప్రవర్తిస్తున్నావో నీకే తెలుస్తుంది.'' అన్నాడు.

సుబ్బారావు ఆలోచనలు పరిపరి విధాలపోతున్నాయి. అతను కరుణాకరాన్ని అనుసరించాలని నిర్ణయించుకున్నాడు.

ఇద్దరూ కలిసి సుబ్బారావు స్కూటర్ మీదే కరుణాకరం ఇంటికి వెళ్ళారు.

కరుణాకరం సుబ్బారావును తన ఇంటి పడక గదిలోనికి తీసుకువెళ్ళి ''ఇది గోడలా కనబడుతోంది కాని ఇందులో తలుపువుంది. అక్కడొక రహస్యపు గది ఉంది. అందులోని వింతలు చూద్దురుగాని పదండి!'' అన్నాడు.

కరుణాకరం ఆ గది తలుపు ఎలా తెరిచాడో సుబ్బారావుకు తెలియలేదు. కానీ అతని వెనకనే ఆ గదిలో మాత్రం ప్రవేశించాడు.

ఆ గది చాలా విశాలంగా ఉంది. చూడ్డానికి ఒక చిన్న సైజు మ్యూజియంలా ఉంది. గది గోడల నానుకుని చుట్టూ ఉడెన్ టేబుల్సున్నాయి. టేబుల్స్‌పైన చిన్న చిన్న అద్దాల షో కేసులున్నాయి. ప్రతి టేబుల్‌కూ సొరుగులున్నాయి.

కరుణాకరం సుబ్బారావును ఒక షో కేస్ వద్దకు తీసుకువెళ్ళి ''మీ పేరు సుబ్బారావ్ అని మీరు చెప్పక పూర్వమే నాకు తెలుసు. ఎందుకంటే మీరు లీలకు బాబాయి గనుక.'' అన్నాడు.

సుబ్బారావు ఉలిక్కిపడి. ''అంటే?'' అన్నాడు.

''లీలమీదకు రామాన్ని ప్రోత్సహించిన వాడిని నేనే! ఆ సన్నివేశానికి ఫొటోలు తీసి ఉంచుకున్నాను. ఆ సన్నివేశానికి గుర్తుగా అప్పుడు నలిగి చిరిగిన ఆమె బట్టలు నావద్ద ఉన్నాయి.'' కరుణాకరం ఒక్క క్షణం ఆగి

"లీల గురించీ, ఆమె కుటుంబ సభ్యుల గురించీ నా దగ్గర ఫోటోలతో వివరాలున్నాయి. ఆమెకూ రామానికీ సంబంధించిన వివరాలున్నాయి. ఏ పరిస్థితుల్లో నేరం జరిగిందో, ఎలా జరిగిందో వివరాలున్నాయి. మానభంగం కావించబడిన యువతి ప్రతిఘటనకు చిహ్నమైన ఆమె బట్టల అవస్థ యధాతథంగా నావద్ద భద్రపర్చబడి ఉంది." అన్నాడు.

"ఇదంతా ఎందుకు, బ్లాక్ మెయిలింగ్ చేయడానికా?" అన్నాడు సుబ్బారావావేశాన్ని అణచుకుని.

"ఎంత మాత్రమూ కాదు. తపాలా బిళ్ళలు సేకరించే హాబీ కొందరి కున్నట్లే నేరానికి సంబంధించిన వస్తువులను సేకరించడం నాహాబీ. వీలైనంతవరకూ ఆ వస్తువుల చరిత్రను కూడా సేకరిస్తూంటాను. నా హాబీని నాతో పాటు పంచుకునేవారు బహుకొద్దిమంది. అందరిలోనూ నావద్దనే ఎక్కువ కలెక్షన్ ఉండేది. ఇటీవల నా స్నేహితుడు కలెక్షన్లో నన్నుమించిపోయాడు. వాడిని అధిగమించడం కోసం నాకు నేనై నేరస్థులను ప్రోత్సహించి నేరాలకు దోహదంచేసి వస్తు సేకరణ చేయడం ఇటీవలే ఆరంభించాను."

సుబ్బారావు నోరు తెరిచి కరుణాకరం వంక చూస్తున్నాడు.

"ఇదేదో పిచ్చితనంలా కనబడుతోంది కదూ నీకు." కానీ వీటి విలువ నీకు తెలియదు. ఒక ఫారినర్ ఒక వస్తువుకు యాభై వేల డాలర్ల దాకా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాడు. ఎందుకంటే ఇలాంటి వస్తు సేకరణ సులభసాధ్యంకాదు." అన్నాడు కరుణాకరం.

"అయితే ఇదంతా నాకెందుకు చూపిస్తున్నావు? అందువల్ల నీ రహస్యం బయటపడిపోయినట్లే కదా!" అన్నాడు సుబ్బారావు.

"ఇంకా అర్థం కాలేదా? నా రహస్యం బయటపడితే నీ కుటుంబానికి ఎంత అవమానం? నేను నేరస్థుడిగా కోర్టులో నిలబడ్డానంటే లీలవంటి ఎందరో అభాగ్యురాండ్ర బ్రతుకులు వీధి కెక్కుతాయి. వాళ్ళ బ్రతుకులు వీధి కెక్కించే ఉద్దేశ్యం నాకు ఏ మాత్రమూ లేదు. అంతా నీలో ఉంది." అన్నాడు కరుణాకరం.

సుబ్బారావుకు నోటమాట రాలేదు. కరుణాకరం ఉద్దేశ్యం అతనికి అర్థమయింది. అతను బయటపడితే లీల బ్రతుకు వక్కచింపిన విస్తరి అవుతుంది. చూస్తూ చూస్తూ తను అందుకు ఎలా పూనుకోగలడు?

"మిస్టర్ సుబ్బారావ్! ఇది నా హాబీ. ప్రమాదకరమైనదే అయినా నాకు చాలా సరదాగా ఉంది. నువ్వు బహుశా లీలా ద్వారా జరిగినది తెలుసుకుని పోలీసులకు సాయపడాలనుకుని ఉంటావు. ఆ ఆలోచన మానుకో. లీలకు ఏ ప్రమాదమూ ఉండదు. లీలకూ చెప్పాను. రామం కనుక ఆమెను బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నిస్తే వాణ్ని హత్యచేసే ఉపాయం కూడా చెబుతానని. కండిషన్ మాత్రం హత్యాయుధాన్ని నాకిచ్చేయాలని! ఈ ప్రపంచంలో ఎన్నో మ్యూజియాలున్నాయి. వాటిలో యుద్ధాల్లో ఉపయోగించబడ్డ ఆయుధాలున్నాయి. సమకాలీన హత్యాయుధాలనూ, నేర చిహ్నాలనూ సేకరించిన ఘనత మాత్రం నాకే దక్కుతుంది. నువ్వు నా జోలికి రావనీ, రాలేవనీ ఆశిస్తున్నాను." అన్నాడు కరుణాకరం.

సుబ్బారావు నిస్పృహగా అక్కణ్ణించి కదిలాడు.

మర్నాడు రాఘవరావు అతన్ని కలిసి—"దొంగలు దొరికినట్లే దొరికి తప్పిపోయారు. ఇందుకు కారణమేమిటో మీ అద్భుత ఊహాశక్తితో చెప్పగలరా?" అనడిగాడు.

"కుక్క బదులు గాడిద అరిస్తే—దానికి మిగిలేవి చావు దెబ్బలే. నామానాన నన్ను బ్రతక నిద్దురూ—" అన్నాడు సుబ్బారావు.

రాఘవరావు ఆశ్చర్యంగా అతని వంక చూశాడు. తర్వాత వారిద్దరి మధ్యా మరెన్నడూ పరిశోధనల గురించిన సంభాషణలు నడవలేదు.

—:ఐపోయింది:—